Follow: @ANNTELUGU

04-10-2026

ANN తెలుగు

# మహా పత్రిక

ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 253 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

## పొలిటికల్ ట్రాప్

రాజకీయ రంగస్థలంపై ఇప్పుడు మాటల యుద్ధం తారాస్థాయికి చేరింది. అధికార పక్షం వేస్తున్న ప్రతి పావు వ్యూహాత్మకంగా మారుతుంటే, ప్రతిపక్షం మాత్రం రక్షణాత్మక ధోరణిలో పడి కొట్టుమిట్టాడుతోంది. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పన్నిన రాజకీయ వలలో గులాబీ పార్టీ నాయకులు చిక్కుకున్నారా? సిరిసిల్ల సభతో కేటీఆర్ టార్గెట్‌గా ఎక్కుపెట్టిన అస్త్రాలు గులాబీదళాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయా? ప్రజాసమస్యలపై పోరాడాల్సిన వేదికలు కాస్తా.. ఆస్తుల పంచాయతీలు, కాంగ్రెస్‌బీఆర్ఎస్ మధ్య మాటల తూటాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్నాయి. అసెంబ్లీ సమావేశాల నుండి గేర్ మార్చిన సీఎం రేవంత్ తనదైన దూకుడుతో ప్రతిపక్షాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. మరోవైపు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలపై కాంగ్రెస్ ముందస్తు అభ్యర్థుల ప్రకటన ఆ పార్టీకి అడ్వాంటేజ్ గా మారుతుందన్న అభిప్రాయం ఉంది. ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ వివాదంపై ప్రజాగ్రహం జ్ఞానేశ్ రాజీనామాను అనివార్యం చేసేలా కనిపిస్తోంది. అసలు రాజకీయాలను శాసిస్తున్న నరేటివ్ పాలిటిక్స్, సోషల్ మీడియా వార్ అసలు కథేంటి?

04

రాజకీయ తెరపై జరుగుతున్న నాటకీయ పరిణామాలపై ఏఎన్ఎన్, మహాపత్రికల సీఈవో



**కంది రామచంద్రారెడ్డి**

***వీకెండ్ అనాలసిస్***

---

**టాప్ న్యూస్**



### లోక్‌సభ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను తక్షణమే రద్దు చేయాలి

- మల్లికార్జున ఖర్గే డిమాండ్
- దేశంలో జరిగినవన్నీ అక్రమ ఎన్నికలే

02



### ఎవరి ఓట్లు ఉంచాలన్నదిబీజేపీ కార్యాలయం నుంచి లిస్ట్ వెళ్తోంది

- ప్రకాశ్‌రాజ్ సంచలన కామెంట్స్

03



### అమిత్ షా తెలంగాణ టూర్ రద్దు

- చివరి నిమిషంలో నిర్ణయం
- నిరాశలో బీజేపీ శ్రేణులు

02

---



# మీనాక్షి వర్సెస్ నిధి అగర్వాల్

## పోటాపోటీగా రిబ్బన్ కటింగ్స్

(మహా ప్రత్యేకం)

మీనాక్షి చౌదరి.. సంక్రాంతికి వస్తున్నాం.. అనగనగా ఒకరాజు, లక్కీ భాస్కర్ వంటి హిట్లతో దూసుకుపోతూనే షాపింగ్ మాల్స్ ఓపెనింగ్స్ లో అనగనగా ఓ రాణిగా మారింది. ఎడాపెడా షాప్ ఓపెనింగ్స్ రిబ్బన్ కటింగ్స్ తో రెండుచేతులా సంపాదిస్తోంది. ఇపుడు నిధి అగర్వాల్ కూడా షాప్ ఓపెనింగ్స్ సెలబ్రిటీ ఈవెంట్స్ లో దూకుడుమీదుంది. రాజాసాబ్, హరిహరవీరమల్లు, ఇస్మార్ట్ శంకర్ వంటి మూవీల్లో నటించిన ఈ భామకు ఇపుడు షాప్ ఓపెనింగ్స్ తో పాటు బ్రాండ్ అంబాసిడర్ అసైన్ మెంట్లలో దూకుడుమీదుంది. ఈ మధ్య కాలంలో అనేక ఓపెనింగ్స్ లో నిధి అగర్వాల్ ను తమ నిధిగా భావిస్తూ తెగ పిలిచేస్తున్నారు బిజినెస్ ఓనర్స్. బిజినెస్ సర్కిల్స్ లో, ప్రేక్షకుల్లో నిధి పాపకు ఓ స్పెషల్ క్రేజ్ ఉంది. సినిమాల పరంగా వీరికి ఎలాంటి కాంపిటీషన్ లేకున్నా షోరూమ్ ఓపెనింగ్స్ పరంగా ఒకరిని మించి మరొకరు ఈవెంట్స్ చేస్తున్నారన్న టాక్ ఇండస్ట్రీలో ఉంది. ఈ మధ్య కాలంలో ప్రతి వారం ఒకటో రెండో ఇలాంటి ఈవెంట్స్ లో వీరిద్దరు కనిపిస్తూనే ఉన్నారు. క్రేజ్ ఉన్నపుడే ఇల్లు చక్కబెట్టుకునే పనిలో ముద్దుగుమ్మలు ఉన్నారు. యంగ్ హీరోయిన్స్ కు ఉన్న ఆర్థిక సదుపాయం, భామల క్రేజ్ చూసి ఇండస్ట్రీలో చెవులు కొరుక్కుంటున్నారు. ఈ మధ్య కాలంలో వస్త్రాలయాలు, షాపింగ్ మాల్స్, జ్యూయలరీ బ్రాండ్స్ సెలబ్రిటీలతోనే వెళ్తుండడంతో భామలకు డిమాండ్ పెరిగింది. గత కొంతకాలంగా ఇలాంటి వాటికి విరామం ఇచ్చిన శ్రీలీల తాజాగా నిర్మల్ లో మెరిసింది.





---



### 10 వ తేదీనుండి బతుకమ్మ వేడుకలు

- 18 న ట్యాంక్ బండ్‌పై సద్దుల బతుకమ్మ
- వేడుకల ఏర్పాట్లపై సీఎస్ సంజయ జాజు సమీక్ష

03



### తిరుపతి శ్రీ సిటీలో ఘోర ప్రమాదం

- ఓ పరిశ్రమలో పేలిన బాయిలర్
- నలుగురు కార్మికులు మృతి, మరొకరి పరిస్థితి విషమం

02



### మెట్రోలో మంత్రుల బృందం

**బేగంపేట నుంచి జూబ్లీ చెక్‌పోస్ట్ వరకు ప్రయాణం**

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ మెట్రోలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ప్రయాణించారు. నగర ప్రయాణికుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన మెట్రోఆర్టీసీ కామన్ పాస్ మిగతా 2వ పేజీలో

---



# చిన్నారులకు డిజిటల్ రక్షణ కవచం

## ఆన్‌లైన్ నేరాల కట్టడికి ప్రత్యేక చర్యలు

- న్యాయ సేవా సంస్థల కృషికి రాష్ట్ర ప్రభుత్వ పూర్తి మద్దతు.
- దక్షిణాది ప్రాంతీయ సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్ఘాటన.

**హైదరాబాద్, మహా :** ఆన్‌లైన్ వేధింపులు, సైబర్ నేరాల బారిన పడకుండా పిల్లలకు అవసరమైన భద్రత, సంరక్షణ కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. జాతీయ న్యాయ సేవా ప్రాధికార సంస్థ (నల్సా) ఆధ్వర్యంలో 'డిజిటల్ వేదికలపై పిల్లలకు రక్షణ, సులభంగా న్యాయం అందించడం ఆన్‌లైన్ లైంగిక వేధింపులను అరికట్టడం' అనే ప్రధాన ఇతివృత్తంతో హైదరాబాద్‌లో దక్షిణాది ప్రాంతీయ సదస్సు ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రతిష్టాత్మక సదస్సుకు హాజరైన ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. డిజిటల్ వేదికలపై పిల్లల రక్షణ కోసం వ్యవస్థలను బలోపేతం చేయడానికి న్యాయ సేవల సంస్థలు చేస్తున్న కృషిని కొనియాడారు. ఈ మంచి కార్యక్రమాలను మిగతా 3వ పేజీలో

### ఆసుపత్రుల నిర్మాణంలో వేగం పెంచండి

- సిబ్బంది నియామకాలకు సన్నాహాలు చేయాలి.
- కలెక్టర్లు విధిగా క్షేత్రస్థాయిలో పర్యటించాలి.
- సీఎంవో అధికారుల సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు.

03



### జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాల్సిందే

- లేకుంటే భారీ నిరసనలు'
- అక్టోబర్ 10న ఛలో ఢిల్లీకి సీజేపీ పిలుపు

02




---




# ఘట్‌కేసర్ సర్కిల్‌లో అంతులేని అక్రమ నిర్మాణాలు...!

## జోడిమెట్లలో విచ్చలవిడిగా వెలుస్తున్న అక్రమ షెడ్లు...!

### హోటళ్లు, వాణిజ్య సముదాయాల కోసం 'జీరో' పర్మిషన్లతో జోరుగా నిర్మాణాలు...!

### పార్కు స్థలాలు, చెరువులను సైతం వదలని అక్రమార్కులు...!

- ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి...!
- అంతా టౌన్ ప్లానింగ్ అధికారుల కనుసన్నల్లోనే...!
- తూతూమంత్రంగా కూల్చివేతలు చేపట్టి చేతులు దులుపుకున్న వైనం...!
- ఎన్ని వార్తలు వచ్చినా 'డోంట్ కేర్' అంటూ మళ్లీ యథావిధిగా సాగుతున్న నిర్మాణ పనులు...!
- హైడ్రాకు సవాల్ విసురుతున్న అక్రమార్కులు ...!
- ఇప్పటికైనా జోనల్ కమిషనర్ స్పందించాలంటున్న స్థానికులు...!

02

ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలో అక్రమార్కులు పెట్రేగిపోతున్నారు.. జోడిమెట్లతో పాటు సర్కిల్‌లోని పలు కీలక ప్రాంతాల్లో నిబంధనలను తుంగలో తొక్కుతూ అంతులేని అక్రమ నిర్మాణాలు విచ్చలవిడిగా వెలుస్తున్నాయి.. ఎటువంటి అనుమతులు లేని 'జీరో' పర్మిషన్లతోనే హోటళ్ళు, వాణిజ్య సముదాయాల కోసం పెద్ద ఎత్తున షెడ్లు జోరుగా నిర్మిస్తుండటంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది.. పచ్చని పార్కు స్థలాలు, చెరువులను సైతం వదలకుండా అక్రమార్కులు యథేచ్ఛగా నిర్మాణ పనులు సాగిస్తున్నారు. ఇదంతా స్థానిక టౌన్ ప్లానింగ్ అధికారుల కనుసన్నల్లోనే సాగుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సదరు అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ, ఏదైనా ఫిర్యాదు వస్తే తూతూమంత్రంగా కూల్చివేతలు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారని స్థానికులు మండిపడుతున్నారు.. పత్రికల్లో ఎన్ని వార్తలు వచ్చినా 'డోంట్ కేర్' అంటూ స్థానిక టౌన్ ప్లానింగ్ అధికారుల అండదండలతో మళ్లీ యథావిధిగా నిర్మాణ పనులు సాగిస్తూ అక్రమార్కులు 'హైడ్రా' వ్యవస్థకు సైతం సవాల్ విసురుతున్నారు. ఇప్పటికైనా జోనల్ కమిషనర్ స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



పార్క్ స్థలంలో కొనసాగుతున్న నిర్మాణం

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | జనరల్ వార్తలు | GENERAL NEWS | ఆదివారం, హైదరాబాద్ | 04-10-2026

# ఘట్‌కేసర్ సర్కిల్‌లో అంతులేని అక్రమ నిర్మాణాలు...!

**మహా, ఘట్‌కేసర్ :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్, ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు రోజురోజుకూ పెచ్చుమీరుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జోడిమెట్ల, అన్నోజిగూడ ప్రాంతాల్లో చెరువులు, పార్కు స్థలాలు, ప్రధాన రహదారులకు ఆనుకుని భారీ అక్రమ నిర్మాణాలు వెలుస్తుండటంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదులు, వార్తా కథనాలు, అధికారుల తనిఖీలు జరిగినప్పటికీ పరిస్థితిలో ఎలాంటి మార్పు కనిపించడం లేదని వారు పేర్కొంటున్నారు.




**తూతూమంత్రంగా కూల్చివేతలు.. ఆపై యథావిధిగా నిర్మాణ పనులు:**
జోడిమెట్లలో తాజా కిచెన్‌కు ఎదురుగా నిర్మితమవుతున్న భారీ షెడ్డు వ్యవహారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఈ నిర్మాణంపై వరుసగా వార్తా కథనాలు వెలువడటంతో టౌన్ ప్లానింగ్ అధికారులు రంగంలోకి దిగినప్పటికీ, కేవలం తూతూమంత్రంగా కూల్చివేతలు చేపట్టి చేతులు దులుపుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల చర్యల అనంతరం రెండు మూడు రోజుల పాటు నిర్మాణ పనులు నిలిపివేసి, ఆ తర్వాత మళ్లీ యథావిధిగా పనులు కొనసాగుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీరో పర్మిషన్‌తో నిర్మాణం కొనసాగుతోందని షెడ్డు విషయంలో కేవలం కొంత భాగం తొలగించడం కాకుండా మొత్తం నిర్మాణాన్ని సీజ్ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఒకవేళ సీజ్ చేసిన తర్వాత కూడా నిర్మాణ కార్యకలాపాలు కొనసాగిస్తే సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. లేకపోతే ఇటువంటి అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడదని వారు అభిప్రాయపడుతున్నారు.

**ఒకరికో న్యాయం.. మరొకరికో న్యాయమా?**
గతంలో ఇదే తాజా కిచెన్ సమీపంలో ఉప్పల్ జోనల్ కమిషనర్ ఆదేశాలతో స్పెషల్ టాస్క్ ఫోర్స్ అధికారులు భారీ షెడ్డును కూల్చివేసి సీజ్ చేసిన విషయం స్థానికులు గుర్తు చేస్తున్నారు. అదే ప్రాంతంలో ఇప్పుడు మరో భారీ షెడ్డు నిర్మాణం కొనసాగుతున్నప్పటికీ, పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోకుండా కేవలం తూతూమంత్రంగా వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోందని వారు పేర్కొంటున్నారు. "ఒకే ప్రాంతంలో ఒకరికో న్యాయం, మరొకరికో న్యాయమా?" అంటూ స్థానికులు అధికారులను ప్రశ్నిస్తున్నారు.

**అశోక్ లేలాండ్ షో రూమ్ ఎదురుగా నిబంధనలకు విరుద్ధంగా మరో భారీ షెడ్డు..!**
తాజా కిచెన్ ప్రాంతంతో పాటు అశోక్ లేలాండ్ షోరూమ్‌కు ఎదురుగా కూడా మరో భారీ షెడ్డు నిర్మాణం కొనసాగుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. సాధారణంగా ఏదైనా వాణిజ్య సముదాయాలు లేదా భారీ షెడ్లు నిర్మించాలంటే మున్సిపల్ బిల్డింగ్ పర్మిషన్, భూవినియోగ మార్పిడి, ల్యాండ్ యూజ్ & జోనింగ్ క్లియరెన్స్, అగ్నిమాపక శాఖ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అనుమతులు తప్పనిసరి. కానీ జోడిమెట్లలోని 'థాజా కిచెన్' సమీపంలో, అలాగే అశోక్ లేలాండ్ షోరూమ్‌కు ఎదురుగా ప్రధాన రహదారిని ఆనుకుని నిర్మిస్తున్న భారీ షెడ్లకు ఎలాంటి ప్లాన్ ఆమోదం కానీ, కనీస అనుమతులు కానీ లేవని స్పష్టమవుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. కనీస పర్మిషన్లు లేకుండా జీరో పర్మిషన్‌తో నిర్మాణాలు సాగిస్తున్నప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**ప్రభుత్వ ఖజానాకు కోట్లలో గండి..!**
ఎలాంటి అనుమతులు లేకుండా కొనసాగుతున్న అక్రమ షెడ్ల నిర్మాణాల వల్ల ప్రభుత్వ ఖజానాకు భారీగా ఆదాయం కోల్పోయే పరిస్థితి ఏర్పడుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. నిర్మాణ అనుమతి ఫీజులు, డెవలప్‌మెంట్ చార్జీలతో పాటు నాన్‌అగ్రికల్చరల్ ల్యాండ్ కన్వర్షన్ రుసుములు ప్రభుత్వానికి అందకుండా పోతున్నాయని, అంతేకాకుండా, వాణిజ్య అవసరాల కోసం వినియోగించే ఈ షెడ్లకు సంబంధించి చెల్లించాల్సిన కమర్షియల్ ప్రాపర్టీ ట్యాక్స్, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు కూడా ప్రభుత్వ ఆదాయానికి దూరమవుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు కొనసాగడం వల్ల ఒకవైపు నిబంధనల ఉల్లంఘన జరుగుతుండగా, మరోవైపు మున్సిపల్, రెవెన్యూ శాఖలకు రావాల్సిన ఆదాయానికి గండి పడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు అక్రమ నిర్మాణాలను గుర్తించి, అనుమతులు, పన్నులు, రుసుముల వివరాలను పరిశీలించి ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని రాబట్టాలని వారు కోరుతున్నారు.

**చెరువులను సైతం వదలని ఆక్రమణదారులు!**
అన్నోజిగూడలోని 'మీరాలం కుంట' చెరువు పరిసరాల్లో నిబంధనలకు విరుద్ధంగా జీ ప్లస్2 (జి+2) భవన నిర్మాణం శరవేగంగా కొనసాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాష్ట్రంలో చెరువుల పరిరక్షణ కోసం కఠినమైన 'ఫుల్ ట్యాంక్ లెవెల్' (ఎఫ్ టి ఎల్ ), 'బఫర్ జోన్' నిబంధనలు అమల్లో ఉన్నప్పటికీ, వాటిని ఏమాత్రం పట్టించుకోకుండా ఆక్రమణదారులు నిర్మాణాలను సాగిస్తుండటంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నీటి వనరుల పరిరక్షణ చట్టాలను గాలికి వదిలేసి, చెరువు ప్రాంతాల్లో భవనాల నిర్మాణానికి అసలు అధికారులు ఏ విధంగా అనుమతులు ఇచ్చారు? లేక అధికారుల కళ్లముందే అక్రమంగా నిర్మిస్తున్నారా? అనే ప్రశ్నలు స్థానికుల నుంచి ఉత్పన్నమవుతున్నాయి.


అశోక్ లేలాండ్ షోరూం ఎదురుగా నిర్మితమవుతున్న భారీ షెడ్డు

గతంలో పత్రికల్లో కథనాలు వెలువడటంతో ఆందోళన చెందిన ఆక్రమణదారులు దాదాపు 15 రోజుల పాటు నిర్మాణ పనులను పూర్తిగా నిలిపివేశారని, అధికారుల ఉదాసీనత, నిర్లక్ష్యాన్నే ఆసరాగా చేసుకుని భవన నిర్మాణ పనులను మళ్లీ శరవేగంగా కొనసాగిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.

**జోనల్ కమిషనర్ తక్షణమే స్పందించాలి..**
ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని జోడిమెట్ల, అన్నోజిగూడ ప్రాంతాల్లో విచ్చలవిడిగా కొనసాగుతున్న భారీ షెడ్లు, నిబంధనలకు విరుద్ధమైన నిర్మాణాలపై జోనల్ కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. సర్కిల్ అధికారులు ఇచ్చే నివేదికలపైనే ఆధారపడకుండా జోనల్ కమిషనర్ స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని వారు కోరుతున్నారు. ప్రత్యేక బృందాలను రంగంలోకి దించి నిర్మాణాలకు సంబంధించిన అనుమతులు, చెరువు బఫర్ జోన్, పార్కు స్థలాల అంశాలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు. జీరో పర్మిషన్లతో నిర్మాణాలు చేపడుతున్న నిర్మాణాలను సీజ్ చేసి, సీజ్ తొలగించి తిరిగి నిర్మాణ పనులు కొనసాగించే వారిపై చట్టప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వారు కోరుతున్నారు. జోనల్ కమిషనర్ నేరుగా రంగంలోకి దిగితేనే విచ్చలవిడిగా కొనసాగుతున్న భారీ షెడ్లు, అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడుతుందని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు.

## పార్కు స్థలంలోనూ జీ ప్లస్-2 భవన నిర్మాణం!

మరోవైపు, అన్నోజిగూడ సత్యసాయి హౌసింగ్ కాలనీలోని సర్వే నంబర్లు 18, 19, 44ల పరిధిలో ప్రజల సాధారణ అవసరాలు, పచ్చదనం కోసం కేటాయించిన పార్కు స్థలంలో సైతం జీ ప్లస్2 భవన నిర్మాణం సాగుతుండటం తీవ్ర కలకలం రేపుతోంది. కాలనీ వాసుల కోసం ఉద్దేశించిన బహిరంగ స్థలాలను (ఓపెన్ స్పేసస్ ) ఇలా వ్యాపార, వ్యక్తిగత అవసరాలకు ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతుంటే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి ఈ అక్రమ నిర్మాణాలపై విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**'హైడ్రా'కే సవాల్‌గా అక్రమాలు.. పర్యవేక్షణ ఏదీ?**
రాష్ట్రంలో చెరువుల పరిరక్షణ, అక్రమ నిర్మాణాల కూల్చివేత విషయంలో 'హైడ్రా' విరుచుకుపడుతున్నా, ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలో సాగుతున్న అక్రమాలు ఏకంగా ఆ వ్యవస్థకే సవాల్ విసురుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. స్థానికులు పదేపదే ఫిర్యాదులు చేస్తున్నా, పత్రికల్లో వరుసగా కథనాలు వెలువడుతున్నా నిర్మాణ పనులు కొనసాగుతుండటం స్థానిక మున్సిపల్ టౌన్ ప్లానింగ్ యంత్రాంగం దారుణంగా విఫలమైందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫిర్యాదులు వచ్చినా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తూ అక్రమార్కులకు కొమ్ముకాస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. స్థానిక అధికారులు చేతులెత్తేసిన వేళ, చెరువులు మరియు ప్రభుత్వ స్థలాల సంరక్షణకు ప్రాధాన్యమిస్తున్న 'హైడ్రా' అయినా తక్షణమే స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. హైడ్రా ఉన్నతాధికారులు నేరుగా రంగంలోకి దిగి జోడిమెట్ల, అన్నోజిగూడ ప్రాంతాల్లోని జీరో పర్మిషన్ షెడ్లను, చెరువు బఫర్ జోన్, పార్కు స్థలాల ఆక్రమణలపై ప్రత్యేక బృందాలతో సమగ్ర విచారణ జరిపి, ఈ అక్రమ నిర్మాణాలను పూర్తిగా సీజ్ చేసి బాధ్యులపై చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.


మీరాలం కుంట చెరువులో యదేచ్ఛగా సాగుతున్న నిర్మాణం















## అమిత్ షా తెలంగాణ టూర్ రద్దు

**చివరి నిమిషంలో నిర్ణయం**
**నిరాశలో బీజేపీ శ్రేణులు**

**హైదరాబాద్, మహా :** కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దయింది. ఒక రోజు పర్యటన నిమిత్తం రేపు ఆయన రాష్ట్రానికి రావాల్సి ఉండగా.. చివరి నిమిషంలో కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నారు. దానికి గల కారణాలేంటో అధికారికంగా వెల్లడికాలేదు. షెడ్యూల్ ప్రకారం అమిత్ షా శనివారం రాత్రి 9 గంటలకు ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని, లోక్‌భవన్‌లో బస చేయాల్సి ఉంది. ఆదివారం ఉదయం మెదక్, కరీంనగర్ జిల్లాల్లో ఆయన పర్యటిస్తారని, పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడంతో పాటు ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటారని షెడ్యూల్ లో పేర్కొన్నారు. హోంమంత్రి పర్యటన కోసం మెదక్, కరీంనగర్ జిల్లాల యంత్రాంగం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. పోలీసులు కూడా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. అయితే పర్యటన రద్దుకు గల కారణం మాత్రం ఇంకా స్పష్టంగా తెలియలేదు. ఢిల్లీలో అత్యవసర పరిణామాలు లేదా ఇతర అనివార్య కారణాల వల్లే పర్యటన రద్దై ఉండొచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పర్యటన రద్దుతో బీజేపీ శ్రేణుల్లో నిరాశ నెలకొంది. అమిత్ షా తెలంగాణకు ఎప్పుడు వస్తారనే విషయాన్ని త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.



## లోక్‌సభ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను తక్షణమే రద్దు చేయాలి

**ఢిల్లీ, మహా** : కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై సంచలన ఆరోపణలు చేస్తూ, తీవ్రమైన డిమాండ్‌ను తెరపైకి తెచ్చారు. దేశంలో జరిగిన ఎన్నికలన్నీ అక్రమమని ఆరోపిస్తూ, లోక్‌సభతో పాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కర్ణాటకలోని కలబుర్గిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, దేశంలో ప్రస్తుత పాలన మొత్తం చట్టవిరుద్ధమైన ఎన్నికల పునాదిపైనే నడుస్తోందని ఆరోపించారు. ఈవీఎంల దుర్వినియోగం, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్)లో జరుగుతున్న అవకతవకల కారణంగానే ఈ డిమాండ్ చేస్తున్నట్లు ఖర్గే స్పష్టం చేశారు. "ఈ రోజు దేశం మొత్తం అక్రమ ఎన్నికల ద్వారానే నడుస్తోంది. మోదీ అక్రమ ప్రధాని, అమిత్ షా అక్రమ మంత్రి అని, దేశంలో ఎన్నికైన ముఖ్యమంత్రులందరూ అక్రమంగా ఆ పదవుల్లో ఉన్నట్టేనని అన్నారు. వాటన్నింటినీ రద్దు చేసి, కేవలం బ్యాలెట్ పత్రాలతోనే మళ్లీ ఎన్నికలు నిర్వహించాలి" అని చెప్పారు. ఈ అంశంపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీతో పాటు ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలతో కూడా చర్చించినట్లు ఖర్గే తెలిపారు. ఈ అక్రమాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించామని, అందులో భాగంగా అక్టోబర్ 6వ తేదీన ఢిల్లీలో విపక్ష ఎంపీలందరూ కలిసి ఎన్నికల సంఘం కార్యాలయానికి నిరసన ర్యాలీ నిర్వహిస్తారని వివరించారు. ఓటర్ల జాబితా నుంచి కొన్ని వర్గాల ప్రజల పేర్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనిపై యువతలో చైతన్యం కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు.

# తిరుపతి శ్రీ సిటీలో ఘోర ప్రమాదం

- ఓ పరిశ్రమలో పేలిన బాయిలర్
- నలుగురు కార్మికులు మృతి, మరొకరి పరిస్థితి విషమం

**తిరుపతి, మహా** : తిరుపతి జిల్లా శ్రీసిటీలో శనివారం ఉదయం ఘోర ప్రమాదం జరిగింది. మందుల తయారు చేసే టిల్ హెల్త్ కేర్ పరిశ్రమలో ఒక్కసారిగా బాయిలర్ పేలి మంటలు చెలరేగి నలుగురు చనిపోయారు. ఈ ఘటనలో నైట్ షిఫ్ట్‌లో ఉన్న ఇద్దరు కార్మికులు అక్కడికక్కడమే ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు.. వారిద్దరు అక్కడ చనిపోయారు. మృతుల్ని తిరుపతి జిల్లా సత్యవేడు మండలం చెరివికి చెందిన చిన్న మస్తాన్, తమిళనాడులోని మాదరపాకానికి చెందిన రమేష్, తమిళనాడుకు చెందిన మోహన్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన గౌరబ్ రాయ్‌గా గుర్తించారు. పశ్చిమ బెంగాల్ కు చెందిన గౌరబ్ రాయ్ (36), తమిళనాడు రాష్ట్రం నాయుడుకుప్పంకు చెందిన మోహన్ (20), ఉన్నారు. మరో కార్మికుడు వాసు (36) తీవ్రంగా గాయపడ్డాడు. అతడి స్వస్థలం తడ అని తెలిపారు. పరిస్థితి విషమంగా ఉండటంతో చెన్నై ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటన జరిగిన వెంటనే రెస్క్యూ టీమ్‌లు పరిశ్రమ దగ్గరకు చేరుకున్నాయి. అక్కడ సహాయక చర్యలు ప్రారంభించారు.. శిథిలాల కింద చిక్కుకున్న వారిని బయటకు తీసి వెంటనే ఆస్పనత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తడకు చెందిన మరో కార్మికుడు వాసు పరిస్థితి విషమంగా ఉండటంతో చెన్నై ఆసుపత్రికి తరలించారు. ఈ పేలుడు జరిగిన సమయంలో పరిశ్రమలో సుమారు 30 మంది కార్మికులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను తొలుత శ్రీసిటీ ఆసుపత్రికి తరలించి, పరిస్థితిని బట్టి మెరుగైన వైద్యం కోసం ఇతర ఆసుపత్రులకు తరలించారు. ఈ టిల్ హెల్త్ కేర్ పరిశ్రమలో బాయిలర్ పేలుడుకు కారణాలు తెలియాల్సి ఉంది.

**సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి**
తిరుపతి జిల్లా శ్రీ సిటీ లోని ప్రైవేట్ పరిశ్రమలో వాటర్ బాయిలర్ పేలి నలుగురు మృతి చెందిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాయిలర్ పేలిన సమయంలో ఘటనా స్థలంలోనే ఇద్దరు చనిపోయారని, మరో ఇద్దరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారని అధికారులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తికి చికిత్స కొనసాగుతోందని వివరించారు. మృతుల కుటుంబాలకు సీఎం తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

**విచారం వ్యక్తం చేసిన పవన్ కళ్యాణ్**
తిరుపతి జిల్లా శ్రీ సిటీలోని టిల్ హెల్త్ కేర్ పరిశ్రమలో బాయిలర్ పేలి నలుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోయిన ఘటన పట్ల డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ విచారం వ్యక్తం చేశారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెడిసిన్స్ తయారు చేసే ఈ పరిశ్రమలో బాయిలర్ పేలడంతో విధుల్లో ఉన్న నలుగురు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందగా, మరికొందరు గాయపడినట్లు అధికారులు వివరించారు. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం చెన్నై అపోలో ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. గాయపడిన వారికి అత్యుత్తమ వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ ఘటనపై తక్షణమే సమగ్ర సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని స్పష్టం చేశారు. మృతుల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

**లోకేష్ ఆరా**
శ్రీసిటి ప్రైవేటు ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంపై మంత్రి లోకేష్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'బాయిలర్ పేలి కార్మికులు మృతి చెందడం, మరికొందరు గాయపడటం తీరని విషాదం. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. తమ వారిని కోల్పోయిన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను కోరుతున్నాను. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుంది' అంటూ మంత్రి లోకేష్ ట్వీట్ చేశారు.

**మాజీ సీఎం జగన్ స్పందన**
తిరుపతి శ్రీ సిటీలో జరిగిన ప్రమాదంపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ ఘటనలో గాయపడినవారంతా త్వరగా కోలుకునేలా చర్యలు తీసుకోవాలని.. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలిచి, తగిన సహాయం అందించాలన్నారు. ఇదిలా ఉంటే.. ఈ ప్రమాదం గురించి తెలిసిన వెంటనే కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శ్రీసిటీకి బయల్దేరి వెళ్లారు. ఈ ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



సధస్సులో పాల్గొన్న విద్యుత్ శాఖ అధికారులు, వినియోగదారులకు సోలార్ గురించి వివరిస్తున్న దృశ్యం



వజ్ర ఎంటర్ప్రైజెస్ ప్రతినిధులు, విద్యుత్ శాఖ అధికారులు మాట్లాడుతున్న దృశ్యం

# కీసరలో 'పిఎం సూర్య ఘర్' అవగాహన సదస్సు, ర్యాలీ...!

- హాజరైన చీఫ్ ఇంజనీర్ పి.వి. రమేష్...!

**కీసర, (మహా)**: కరెంట్ బిల్లుల భారాన్ని తగ్గించుకుంటూ సొంతంగా విద్యుత్‌ను తయారు చేసుకునే గొప్ప అవకాశం 'పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన' అని విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. టీజీఎస్‌పీడీసీఎల్ కీసర కస్టమర్ సర్వీస్ సెంటర్ (సి ఎస్ సి ) పరిధిలో 'సేవా సేతు పీఎం సూర్యఘర్' సోలార్ అవగాహన కార్యక్రమంతో పాటు, ర్యాలీని నిర్వహించారు. ఈ సదస్సుకు వినియోగదారుల నుంచి విశేష స్పందన లభించింది.

ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ హబ్సిగూడ సర్కిల్ ఎస్‌ఈ పి. వెంకన్న, కీసర డీఈ టి. లింగయ్య హాజరై మాట్లాడారు. ఇంటి కప్పులపై సోలార్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఉచిత విద్యుత్‌ను పొందడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడవచ్చని పిలుపునిచ్చారు.

**ర్యాలీకి విశేష స్పందన**: ప్రజల్లో అవగాహన పెంచేందుకు నిర్వహించిన ర్యాలీలో కీసర డివిజన్ ఏడీఈలు, ఏఈలు, విద్యుత్ సిబ్బంది, 'తెలంగాణ పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ' (టీజీ రెడ్కో) జిల్లా మేనేజర్ (డి.ఎం) పాల్గొన్నారు. సోలార్ వాడకంపై కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు.లోన్ సదుపాయం, సబ్సిడీల వివరణ: సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు అవసరమైన ఆర్థిక సాయం అందించేందుకు బ్యాంకర్లు, అలాగే నాణ్యమైన పరికరాలను అందుబాటులో ఉంచేందుకు 'వజ్రా ఎంటర్ప్రైజెస్'తో పాటు పలు నమోదిత సోలార్ వెండర్లు ఈ సదస్సులో పాల్గొన్నారు. ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేసి, వినియోగదారులకు రూఫ్‌టాప్ సోలార్ ఇన్‌స్టాలేషన్, ప్రభుత్వ సబ్సిడీలు, బ్యాంకు రుణ సదుపాయాలపై ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో జరిగిన ఈ ప్రచార కార్యక్రమం ప్రజల్లోకి సోలార్ శక్తి ప్రాముఖ్యతను వేగంగా తీసుకెళ్లేందుకు దోహదపడుతుందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



ర్యాలీ లో పాల్గొన్న అధికారులు

## మెట్రోలో మంత్రుల బృందం

(మొదటి పేజీ తరువాయి)

విశేషాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మంత్రుల బృందం బేగంపేట నుంచి జూబ్లీ చెక్‌పోస్టు వరకు ప్రయాణం చేశారు. ఈ సందర్భంగా ప్రయాణికులపై ఆర్థిక భారం పడకుండా కాంబో పాస్ తీసుకొచ్చినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మెట్రో-ఆర్టీసీ అనుసంధానాన్ని మరింత విస్తరిస్తామని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఇంటి నుంచి గమ్యస్థానం వరకు సులభమైన ప్రయాణమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. భవిష్యత్‌లో మెట్రో-ఆర్టీసీతో పాటు ఆటోలు, ఊబర్ సేవలను అనుసంధానించే ఆలోచనలో ఉన్నట్లు చెప్పారు. చివరి గమ్యస్థానానికి చేరుకునేలా 'లాస్ట్ మైల్ కనెక్టివిటీ'పై దృష్టి పెట్టామని స్పష్టం చేశారు. ప్రజా రవాణా వ్యవస్థను సమగ్రంగా అనుసంధానం చేస్తామన్న ఆయన, ప్రయాణికుల సౌకర్యమే లక్ష్యంగా ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్ సేవలను తీసుకొచ్చినట్లు వివరించారు. ఈ సందర్భంగా కామన్ పాస్‌ను అందుబాటులోకి తెచ్చిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు భట్టి కృతజ్ఞతలు తెలిపారు.





# గోదావరి పుష్కరాల పనుల్లో జాప్యం లేకుండా సమన్వయంతో పనిచేయాలి

- **దేవాదాయ శాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్**
- **పుష్కర పనుల్లో భూసేకరణ, టెండర్లు, సాంకేతిక అనుమతుల ప్రక్రియ చేయాలి**
- **రూ.234.05 కోట్ల అదనపు బడ్జెట్ ప్రతిపాదనలపై సమీక్ష**

**పెద్దపల్లి మహా** :పెద్దపల్లి ఐడీఓసీ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష 2027 గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని చేపడుతున్న అభివృద్ధి పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పని చేయాలని దేవాదాయ శాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ అధికారులను ఆదేశించారు. శనివారం గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో శైలజా రామయ్యర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ, పుష్కర పనులకు సంబంధించిన భూసేకరణ, టెండర్లు, సాంకేతిక అనుమతులు, ఎల్.ఓ.ఏ. తదితర ప్రక్రియలను వేగవంతం చేసి, పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పుష్కరాలకు తరలివచ్చే భక్తులకు అవసరమైన మౌలిక వసతులు ముందుగానే సిద్ధంగా ఉండేలా శాఖల మధ్య సమన్వయాన్ని మరింత పెంచాలని సూచించారు. పుష్కర పనులకు అవసరమైన భూముల భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, భూసేకరణకు సంబంధించిన ప్రతిపాదనలు, ప్రభుత్వ ఉత్తర్వులు జారీ అయిన అనంతరం చేపట్టాల్సిన తదుపరి చర్యలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలోని మంథని పుష్కర పనులకు సంబంధించి ఇరిగేషన్ శాఖ భూసేకరణకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో తదుపరి ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

**పుష్కర ఘాట్ల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి**

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, పెద్దపల్లి జిల్లాలో గోదావరి పుష్కరాల కోసం చేపడుతున్న అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఘాట్ల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవో మంథని సురేష్‌తో పాటు ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, మున్సిపల్, దేవాదాయ శాఖలకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# 10 వ తేదీనుండి బతుకమ్మ వేడుకలు

**హైదరాబాద్, మహా** : తెలంగాణా సంస్కృతికి ప్రత్యేకంగా నిలిచిన బతుకమ్మ పండగను ఈనెల 10 వ తేదీనుండి 18 వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వెల్లడించారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే బతుకమ్మ వేడుకల ఏర్పాట్లపై శనివారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల కార్యదర్శులు, పోలీస్ అధికారులు హాజయ్యారు. ఈ సందర్భంగా సిఎస్ ఈనెల 18 వ తేదీన సద్దుల బతుకమ్మ ను పురస్కరించుకొని ట్యాంక్ బండ్ పై వేలాది మంది మహిళలచే సద్దుల బతుకమ్మ ఉత్సవాన్ని అత్యంత వైభంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 18వ తేదీ సాయంత్రం 4 గంటలకు సచివాలయం ఎదురుగాగల అమరవీరుల స్మారక కేంద్రం నుండి వేలాది మంది మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా వచ్చి ట్యాంక్ బండ్ పైకి చేరుకుంటారని, వీరితో పాటు వందలాది మంది కళాకారులు తమ కళారూపాలతో ర్యాలీగా వస్తారని వివరించారు. ట్యాంvక్ బండ్ పై ఏర్పాటు చేసే ప్రత్యేక వేదిక వద్ద జరిగే ఈ బతుకమ్మ ఉత్సవాలకు ప్రజాప్రతినిధులు హాజరవుతారని అన్నారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకొని పండగ శోభ వచ్చేలా నగరంలోని ప్రధాన కూడళ్లలో బతుకమ్మలను ఏర్పాటు చేయడమే కాకుండా పలు జంక్షన్ల కేంద్రాల వద్ద విద్యుత్ దీపాలతో అలంకరించాలని ఆదేశించారు. నగరంలోని అన్ని ప్రధాన కార్యాలయాలను కూడా విద్యుత్ దీపాలతో అలంకరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ట్యాంక్ బండ్ పై బతుకమ్మ ఆడేందుకు సమీపంలోని వాడలు, కాలనీలు, బస్తీల నుండి పెద్ద ఎత్తున మహిళలు వచ్చే అవకాశమున్నందున వారికి ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా, ట్యాంక్ బండ్ చిల్డ్రన్స్ పార్క్ లో ఉన్న బతుకమ్మ ఘాట్ తోపాటు నెక్లెస్ రోడ్డులో బతుకమ్మ ల నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని హెచ్ఎండీఏ, జీహెచ్ ఎంసీ అధికారులను సిఎస్ ఆదేశించారు. సాయంత్రం 5 నుండి రాత్రి 10 గంటల మధ్య ట్యాంకు బండ్ పై బతుకమ్మ ఉత్సవాలు జరుగుతున్నందున ట్రాఫిక్ డైవర్షన్, బారికేడింగ్, కనీస సౌకర్యాల ఏర్పాట్లను చేపట్టాలని తెలిపారు. అమరవీరుల స్మారక కేంద్రం నుండి ట్యాంక్ బండ్ వరకు ప్రత్యేకంగా బారికేడింగ్, లైటింగ్ సౌకర్యాలను కల్పించాలని సూచించారు. బతుకమ్మ జరిగే పది రోజుల పాటు రవీంద్ర భారతిలో బతుకమ్మ ఉత్సవాలను నిర్వహిస్తున్నందున అక్కడ కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు. రాష్ట్రంలోని అన్ని టూరిజం కేంద్రాలు, ప్రముఖ ప్రాంతాల్లోనూ బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించాలని అన్నారు. బతుకమ్మ ఉత్సవాలను ప్రతిబింబించేలా ఈసారి ప్రత్యేక లోగోను రూపొందిస్తున్నామని వెల్లడించారు. డిసెంబర్ లో జరుగనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ను కూడా ఈ లోగోలో తెలియచేసే విధంగా రూపొందించనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి వాణి ప్రసాద్, హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్, పంచాయితీ రాజ్ కమిషనర్ దివ్య, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, ఆర్టీసీ ఎం.డి. నాగిరెడ్డి, మల్కాజిగిరి సీపీ బి.సుమతి, జాయింట్ పోలీస్ కమిషనర్ (ట్రాఫిక్), హైదరాబాద్ జోయెల్ డేవిస్, స్పెషల్ కమిషనర్, సమాచార పౌర సంబంధాల శాఖ ముకుంద రెడ్డి, హార్టికల్చర్ కమిషనర్ షేక్ యాస్మీన్ బాషా, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, టూరిజం డైరెక్టర్ రంజిత్ నాయక్, శిల్పారామం, సంస్కృతిక శాఖ డైరెక్టర్ ఎ. నర్సింహారెడ్డి, ప్రత్యేక అధికారి కిషన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాల్సిందే

ఢిల్లీ, మహా : ముంబయిలోని శివాజీ పార్కులో వేలాది మందితో భారీ ప్రదర్శన నిర్వహించిన అనంతరం కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) మరో కీలక ప్రకటన చేసింది. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయకపోతే, అక్టోబర్ 10న భారతదేశ నలుమూలల నుంచి ఢిల్లీకి పాదయాత్ర చేసి జంతర్ మంతర్ వద్ద నిరసన తెలుపుతాం. ఈ క్రమంలో దారిలో ఎక్కడైనా ఢిల్లీ పోలీసులు మమ్మల్ని అడ్డుకుంటే, వారు ఎక్కడైతే ఆపుతారో అదే మాకు జంతర్‌మంతర్ అవుతుంది. ప్రజాస్వామ్యాన్ని, పారదర్శకమైన ఎన్నికలను కాపాడేందుకు మేం గాంధీ మార్గాన్ని అనుసరిస్తాం. పారదర్శకమైన ఎన్నికలను ఎవరైతే కోరుకుంటారో వారు మాతో రావాలి." అని సీజేపీ వ్యవస్థాపకులు అభిజిత్ దీప్కే అన్నారు.

# చిన్నారులకు డిజిటల్ రక్షణ కవచం

**( మొదటి పేజీ తరుయవాయి )**

ప్రతి గ్రామానికి చేరవేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణంగా సహకరిస్తుందని హామీ ఇచ్చారు. ప్రస్తుత తరుణంలో సైబర్ భద్రతను ఇతివృత్తంగా ఎంచుకుని సదస్సు నిర్వహించిన నల్సాకు, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్ నాథ్‌కు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మహిళలు, చిన్నారుల రక్షణ కోసం రాష్ట్రంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో భరోసా కేంద్రాలు, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్లు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు, ప్రత్యేక కోర్టులు సమర్థవంతంగా పనిచేస్తున్నాయని ముఖ్యమంత్రి వివరించారు. బాధితులకు ఒకేచోట పోలీసు, వైద్య, న్యాయ సహాయంతో పాటు కౌన్సెలింగ్ అందించేలా భరోసా కేంద్రాలను తీర్చిదిద్దామన్నారు. దేశంలోనే మొట్టమొదటి 'చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టు'ను సైతం హైదరాబాద్‌లోనే ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. పిల్లల రక్షణ కోసం విమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో షీభరోసా సైబర్ ల్యాబ్‌లు పనిచేస్తున్నాయని, సైబ్‌హెర్ యాప్ ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ భద్రతపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. విద్యార్థులనే సైబర్ అంబాసిడర్లుగా తయారు చేసి తోటివారికి సైబర్ భద్రతపై అవగాహన కల్పించే వినూత్న కార్యక్రమం చేపట్టామన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసినప్పుడే పిల్లల రక్షణ సాధ్యమవుతుందన్నారు. రాష్ట్ర న్యాయ సేవా ప్రాధికార సంస్థ (టీజీఎస్ఎల్ఎస్ఏ) ఇప్పటికే పాఠశాల విద్యాశాఖతో ఒప్పందం కుదుర్చుకుని, విద్యార్థులకు




చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పిస్తోందని, ఇప్పటివరకు మూడు వేల మందికి పైగా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులకు శిక్షణ ఇచ్చామని సీఎం వెల్లడించారు. సైబర్ నేరాల నియంత్రణలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. పిల్లలు పొరపాటున సైబర్ నేరాల వలలో పడినప్పుడు వారిని తప్పుబట్టకుండా, ఆసక్తితో, అవగాహనతో అండగా నిలవాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాలకు గురైనప్పుడు ప్రతి ఒక్కరూ సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నంబర్ 1930ను, అలాగే పిల్లల సహాయం కోసం 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్‌ను విధిగా గుర్తుంచుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బాధితులకు ఆర్థిక సహాయం అందించడం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశం కల్పించడం వరకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు. నేరస్తుడికి శిక్ష పడటమే కాదు, బాధితుడి జీవితాన్ని తిరిగి నిలబెట్టి, వారు కోల్పోయిన బాల్యాన్ని, గౌరవాన్ని తిరిగి అందించడమే నిజమైన న్యాయమని ముఖ్యమంత్రి అభివర్ణించారు. ఈ సదస్సులో జరిగే చర్చలు, సిఫారసులు యావత్ దేశానికి మార్గదర్శకంగా నిలుస్తాయని ఆయన ఆకాంక్షించారు. అనంతరం ఉచిత న్యాయ సేవల నిమిత్తం సిద్ధం చేసిన సంచార లోక్ అదాలత్ (మొబైల్ లోక్ అదాలత్) వాహనాలను కేంద్ర మంత్రులు, న్యాయమూర్తుల సమక్షంలో సీఎం జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఈ అత్యున్నత స్థాయి సదస్సులో కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘావాల్, నల్సా ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్ నాథ్, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఆర్. మహదేవన్, జస్టిస్ అలోక్ అరాధే, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ పాల్గొన్నారు. వీరితో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, ఒడిశా, సిక్కిం, తమిళనాడు, త్రిపుర హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ జస్టిస్ శ్యామ్ కోషి, పలు రాష్ట్రాల హైకోర్టు న్యాయమూర్తులు, ఉన్నతాధికారులు విశేష సంఖ్యలో హాజరయ్యారు.

# ఆసుపత్రుల నిర్మాణంలో వేగం పెంచండి

**హైదరాబాద్, మహా** : రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఉస్మానియా, వరంగల్ సూపర్ స్పెషాలిటీ, ఎల్బీ నగర్, అల్వాల్ టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణ పనులను ముమ్మరం చేయాలని, పనుల్లో వేగం పెంచాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆయా ఆసుపత్రుల్లో భవిష్యత్తులో అవసరమయ్యే వైద్యులు, ఇతర వైద్య సిబ్బందికి సంబంధించిన వివరాలను ముందుగానే గుర్తించి, నియామక ప్రక్రియను కూడా వెంటనే ప్రారంభించాలని సూచించారు. శనివారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ముఖ్యమంత్రి కార్యాలయ (సీఎంవో) అధికారులతో రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలకు సంబంధించిన క్షేత్రస్థాయి పరిస్థితులు, ఆసుపత్రుల నిర్మాణ పురోగతిపై ముఖ్యమంత్రి సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు.కొత్త ఆసుపత్రుల నిర్మాణాలు పూర్తయ్యే నాటికి ఎక్కడా సిబ్బంది కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సీఎం ఆదేశించారు. అంతేకాకుండా, భవనాలు అందుబాటులోకి వచ్చే సమయానికే అన్ని ఆసుపత్రుల్లో అవసరమైన అత్యాధునిక వైద్య పరికరాలను కొనుగోలు చేసి, రోగులకు అన్ని రకాల నాణ్యమైన వైద్య సేవలను సత్వరమే అందుబాటులోకి తీసుకురావాలని ఆయన స్పష్టం చేశారు. విద్య, వైద్య రంగాలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, ఇందులో రాజీపడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.




రాష్ట్రంలో పాలనను మరింత పారదర్శకంగా, జవాబుదారీగా మార్చేందుకు జిల్లా కలెక్టర్లతో పాటు ఉన్నతాధికారులందరూ విధిగా క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు, సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, వివిధ స్థాయిల్లోని ప్రభుత్వ ఆసుపత్రులను క్రమం తప్పకుండా స్వయంగా సందర్శించి, క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేయాలన్నారు. దీనిపై జిల్లా స్థాయిలో ప్రతి వారం ఒక ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించి, లోపాలను ఎప్పటికప్పుడు సరిదిద్దుకోవాలని సూచించారు. ప్రస్తుతం వర్షాకాలం కొనసాగుతున్న దృష్ట్యా, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య, ఆరోగ్య శాఖల యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. అలాగే, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చోట తక్షణమే మరమ్మతు పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు, డిసెంబరు నెలలో ముచ్చర్లలోని 'భారత్ ఫ్యూచర్ సిటీ'లో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించ తలపెట్టిన 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు సంబంధించిన ఏర్పాట్లపైనా ఈ సమావేశంలో సీఎం విస్తృతంగా చర్చించారు. సమ్మిట్ వేదిక ఏర్పాట్లు, ఆహ్వానించాల్సిన జాతీయ, అంతర్జాతీయ అతిథులు, రాష్ట్రానికి రాబట్టాల్సిన పెట్టుబడుల లక్ష్యాలపై పకడ్బందీగా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. త్వరలోనే తానే స్వయంగా సమ్మిట్ ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ కీలక సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్‌తో పాటు సీఎంవో ముఖ్య కార్యదర్శులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అక్రమాల్లో గటికుడు

- **నకిలీపత్రాలు సృష్టించిన బిజెపి జిల్లా కార్యదర్శి క్రాంతికుమార్**
- **రూ.67.20లక్షల మోసం కేసులో కటకటాలపాలు**
- **ఎమ్మెల్యే అండతో రెచ్చిపోతున్న అక్రమార్కులు**
- **బాధితుల ఆక్రందనతో అడ్డంగా బుక్కవుతున్న వైనం**

**ఆదిలాబాద్, మహా** : అక్రమాల్లో గటికుడు గటిక క్రాంతికుమార్ రూ.70లక్షల చీటింగ్ కేసులో కటకటాల పాలయ్యాడు. బిజెపి నేతలు అనేకమంది ఆరోపణల్లో చిక్కుతున్నారు. గటిక క్రాంతికుమార్ ఎమ్మెల్యే అండచూసుకుని చేస్తున్న అరాచకాలు, అక్రమాలకు ఇది నిదర్శనంగా నిలుస్తోంది. భాజపా జిల్లా ప్రధానకార్యదర్శిగా ఉన్న గటిక క్రాంతికుమార్ ఓ ప్లాట్ కు నకిలీ పత్రాలు సృష్టించడమే కాకుండా, ఆయన పేరునే రుణం తీసుకోవడంతో దారుణం బయటపడింది. ఆదివాసీ బాధితుడిని రూ.67.20లక్షలకు మోసం చేయడంతో పాటు ప్రశ్నించినందుకు చంపుతామని బెదిరించడంతో బాధితుడు బేర్ మంటూ పోలీసులను ఆశ్రయించిన దుస్థితి. డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని ఎల్బీ నగర్







లో ప్లాటు ఉందని మడావి గోపాల్ అనే వ్యక్తిని గటిక లక్ష్మణ్ స్వామి, గటిక క్రాంతికుమార్(భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి), తోకల నరేష్(ప్రస్తుత కౌన్సిలర్) నమ్మించారు. ఆ ప్లాటుకు నకిలీ పత్రాలు సృష్టించి ఖరీదుది పేరు రిజిస్ట్రేషన్ చేయించి ఆయన పేరుతోనే ఇంటి రుణం తీసుకున్నారు. ఈ మోసంపై బాధితుడు ఫిర్యాదు చేయడంతో విచారణ జరిపి నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. షర్టుకు తెలియకుండా బనియన్ లాగేసినట్లు, ఇంటియాజమానికే తెలియకుండా ఆయన పేరునే రుణం తీయడం షాకింగ్ గా మారింది. ఇటీవల ఎమ్మెల్యే తన శ్రీమతి పేరున భూకబ్జా చేశారంటూ పత్రికల్లో కథనాలు రాగా, ఇంకా పలువురు బిజెపి కౌన్సిలర్లు, ఎమ్మెల్యే అండచూసుకుని రెచ్చిపోయే ఒకరిద్దరు అక్రమాలకు పాల్పడి ఇట్టే దొరికిపోతున్నారు. దీంతో ఆదిలాబాద్ బిజెపి నేతల దందాలు చూసి రాష్ట్రపార్టీ తలపట్టుకుంటోంది. కాగా అక్రమాల ఆరోపణలపై అరెస్టయిన నేతలకు సంబంధించిన వ్యవహారం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ నేతల మూలంగా పార్టీ పరువుపోతోందంటూ ఇతర నేతలు ఆవేదన చెందుతున్నారు.

# 'హిజాబ్ తీయాలా, గడ్డం కత్తిరించాలా అనేది మీ ఇష్టం'

**హైదరాబాద్, మహా** : ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. యువత, ముఖ్యంగా అమ్మాయిలు తమ అభిప్రాయాలను ధైర్యంగా వ్యక్తం చేయాలని హితవు పలికారు. హిజాబ్ తీయాలా వద్దా.. గడ్డం కత్తిరించాలా లేదా అనేది వారి ఇష్టమని ముస్లిం యువతీయువకులకు సూచించారు. అంతేకాకుండా విద్యతో పాటు తమ హక్కులు, వ్యక్తిగత నిర్ణయాల విషయంలో ఎవరూ వెనక్కి తగ్గొద్దని చెప్పారు. హిజాబ్ ధరించడం మహిళల ఇష్టమని తేల్చిచెప్పారు. మహిళలు హిజాబ్ వేసుకోవాలా వద్దా.. యువకులు గడ్డం కత్తిరించాలా వద్దా అని ఎవరూ ఆదేశించలేరని పేర్కొన్నారు. విద్యార్థులతో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న అక్బరుద్దీన్ ఓవైసీ.. తన విద్యాభ్యాసం గురించి ప్రస్తావించారు. తాను 12వ తరగతి వరకు మాత్రమే చదువుకున్నానని చెప్పారు. అయితే అసెంబ్లీలో తాను భయపడకుండా, స్పష్టంగా తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తానని తెలిపారు. తాను చెప్పే విషయాలకు అప్పటి ముఖ్యమంత్రులు కూడా స్పందించాల్సి వచ్చేదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా యువత కూడా భయపడకుండా తమ అభిప్రాయాలను చెప్పాలని సూచించారు.జెన్‌జీని ప్రస్తావిస్తూ ప్రస్తుతం ప్రపంచం ధైర్యంగా, స్పష్టంగా మాట్లాడే యువత గురించి చర్చిస్తోందని అక్బరుద్దీన్ ఓవైసీ తెలిపారు. నిజమని నమ్మిన విషయాన్ని చెప్పేందుకు భయపడాల్సిన అవసరం లేదని సూచించారు. తన ప్రసంగంలో అక్బరుద్దీన్ ఓవైసీ వ్యక్తిగత నమ్మకాలు, సూత్రాల గురించి కూడా మాట్లాడారు. ఎమ్మెల్యేను, మంత్రిని, ప్రధానమంత్రిని సంతోషపెట్టేందుకు పనిచేయకూడదని పేర్కొన్నారు. పనిచేయాల్సి వస్తే అల్లాను సంతోషపెట్టేలా పనిచేయాలని హితవు పలికారు. తన గురించి అవతలి వ్యక్తులు ఏం అనుకుంటున్నారనే విషయాన్ని తాను పట్టించుకోనని అసదుద్దీన్ ఓవైసీ చెప్పారు. తన గౌరవాన్ని దెబ్బతీసేందుకు, తనను అవమానించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని వ్యాఖ్యానించారు. హిజాబ్ విషయంపైనా అక్బరుద్దీన్ ఓవైసీ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. హిజాబ్ ధరించినందుకు ఎవరినీ చూసి భయపడాల్సిన అవసరం లేదని.. అది మహిళ వ్యక్తిగత ఎంపిక అని పేర్కొన్నారు. మహిళలు విద్యను అందిపుచ్చుకుని ప్రపంచంలో ముందుకు వెళ్లాలని అక్బరుద్దీన్ ఓవైసీ పిలుపునిచ్చారు. తండ్రిగా, సోదరుడిగా, కుమారుడిగా మహిళల హక్కుల కోసం తాను అండగా ఉంటానని పేర్కొన్నారు. తన గౌరవం, ప్రతిష్ఠపై కూడా అక్బరుద్దీన్ ఓవైసీ కీలక వ్యాఖ్యలు చేశారు. తనను అవమానించేందుకు, తన పరువు తీసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని.. అలాంటి ప్రయత్నాలకు తాను భయపడబోనని స్పష్టం చేశారు. తన గౌరవాన్ని అల్లా కాపాడతాడని.. తాను ఎవరి గురించి పట్టించుకోనని అక్బరుద్దీన్ ఓవైసీ తేల్చి చెప్పారు.

ఎవరి ఓట్లు ఉంచాలన్నది

## బీజేపీ కార్యాలయం నుంచి లిస్ట్ వెళ్తోంది

**ప్రకాశ్‌రాజ్‌సంచలన కామెంట్స్**

**హైదరాబాద్, మహా** : ఓటర్ల జాబితాలో ఎవరి ఓట్లు ఉంచాలన్నది బీజేపీ కార్యాలయం నుంచి లిస్ట్ వెళ్తోందని నటుడు ప్రకాశ్‌రాజ్ ఆరోపించారు. పారదర్శకంగా ఉన్న ఓటర్ల జాబితాకు ఎస్ఐఆర్ అనే పరీక్ష పెట్టారని మండిపడ్డారు. హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రకాశ్ రాజ్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఈసీ, కేంద్రప్రభుత్వంపై ఆయన పలు విమర్శలు గుప్పించారు. సర్ పేరుతో ప్రజలు తాము బతికి ఉన్నామని నిరూపించుకోవాల్సిన పరిస్థితి కల్పించారని నటుడు ప్రకాశ్‌రాజ్ ఆరోపించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వల్ల దేశవ్యాప్తంగా ఏం జరిగిందో అందరికీ తెలుసని, దాదాపు 13 కోట్ల మంది ఓటర్లు అనర్హులయ్యారని విమర్శించారు. ఈసీ తీసుకున్న నిర్ణయం తప్పని పేర్కొన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని ప్రకాశ్‌రాజ్ డిమాండ్ చేశారు.



## హుజూర్‌నగర్ నుంచే బరిలోకి

- **రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి .**

**హైదరాబాద్, మహా**: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లోనూ తాను హుజూర్‌నగర్ నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. భవిష్యత్తులో నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) జరిగితే తుంగతుర్తి నుంచి పోటీ చేస్తారంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. శనివారం హైదరాబాద్‌లో విలేకరులతో నిర్వహించిన చిట్ చాట్ లో మంత్రి మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంపై పూర్తి స్పష్టతనిచ్చారు. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న ఊహాగానాలను ఎవరూ నమ్మవద్దని ఆయన కోరారు. తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని తాటిపాముల తన స్వగ్రామమని గుర్తుచేసిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పుట్టిన ఊరిపై ఉన్న మమకారంతో అక్కడ పలు అభివృద్ధి పనులను సొంత నిధులతో పాటు ప్రభుత్వపరంగా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. కేవలం గ్రామాభివృద్ధి కోసమే తాము పనిచేస్తున్నామని, దానిని రాజకీయాలతో ముడిపెట్టి అసత్య ప్రచారాలు చేయడం సరికాదన్నారు. తన రాజకీయ ప్రస్థానంలో హుజూర్‌నగర్ ప్రజలతో విడదీయరాని అనుబంధం ఉందని, వచ్చే ఎన్నికల్లోనూ అక్కడి నుంచే ప్రజాక్షేత్రంలోకి దిగుతానని తేల్చిచెప్పారు. మరోవైపు కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మూడు ప్రధాన బ్యారేజీల పునరుద్ధరణపై మంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. బ్యారేజీల నిర్మాణంలో తలెత్తిన లోపాలు పూర్తిగా డిజైన్ సమస్యల వల్లే ఏర్పడినట్లు నిర్ధారణ అయితే, వాటి మరమ్మతు ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని వెల్లడించారు. ఒకవేళ నిర్మాణ సంస్థల నిర్లక్ష్యం లేదా నిర్మాణ లోపాల వల్ల ఈ సమస్యలు తలెత్తినట్లు తేలితే మాత్రం సంబంధిత నిర్మాణ సంస్థలే పూర్తి ఖర్చును భరించాల్సి ఉంటుందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు.

# పొలిటికల్ ట్రాప్

రాజకీయ రంగస్థలంపై ఇప్పుడు మాటల యుద్ధం తారాస్థాయికి చేరింది. అధికార పక్షం వేస్తున్న ప్రతి పావు వ్యూహాత్మకంగా మారుతుంటే, ప్రతిపక్షం మాత్రం రక్షణాత్మక ధోరణిలో పడి కొట్టుమిట్టాడుతోంది. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పన్నిన రాజకీయ వలలో గులాబీ పార్టీ నాయకులు చిక్కుకున్నారా? సిరిసిల్ల సభతో కేటీఆర్ టార్గెట్‌గా ఎక్కుపెట్టిన అస్త్రాలు గులాబీదళాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయా? ప్రజాసమస్యలపై పోరాడాల్సిన వేదికలు కాస్తా.. ఆస్తుల పంచాయతీలు, కాంగ్రెస్‌బీఆర్ఎస్ మధ్య మాటల తూటాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్నాయి. అసెంబ్లీ సమావేశాల నుండి గేర్ మార్చిన సీఎం రేవంత్ తనదైన దూకుడుతో ప్రతిపక్షాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. మరోవైపు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలపై కాంగ్రెస్ ముందస్తు అభ్యర్థుల ప్రకటన ఆ పార్టీకి అడ్వాంటేజ్ గా మారుతుందన్న అభిప్రాయం ఉంది. ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ వివాదంపై ప్రజాగ్రహం జ్ఞానేశ్ రాజీనామాను అనివార్యం చేసేలా కనిపిస్తోంది. అసలు రాజకీయాలను శాసిస్తున్న నరేటివ్ పాలిటిక్స్, సోషల్ మీడియా వార్ అసలు కథేంటి?

**రాజకీయ తెరపై జరుగుతున్న నాటకీయ పరిణామాలపై ఏఎన్ఎన్, మహాపత్రికల సీఈవో**

**కంది రామచంద్రారెడ్డి**
**వీకెండ్ అనాలసిస్**

తెలంగాణ రాజకీయాలు మరోసారి గూడెం గుసగుసల నుంచి బహిరంగ సవాళ్ల స్థాయికి చేరాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల గడ్డపైనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఒక దశాబ్ద కాలం పాటు అధికారంలో ఉన్న గులాబీ బాస్ కుటుంబంపై రేవంత్ సంధించిన ఆరోపణలు ఇప్పుడు రాష్ట్రంలో హాట్ టాపిక్‌గా మారాయి. సిరిసిల్ల ప్రజాపాలన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి కేటీఆర్ ఆస్తులపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ పరిసర ప్రాంతాల్లోని ప్రముఖ ఫైవ్ స్టార్ హోటల్స్ డెక్కన్ సెరాయ్ తో పాటు ఎట్ హోమ్ సర్వీస్ అపార్ట్‌మెంట్లు ఎవరివని ఆయన ప్రశ్నించారు. గతంలో ఇతరుల పేరున ఉన్న ఈ వేల కోట్ల ఆస్తులు గత కొద్ది నెలల కిందట కేటీఆర్ మరియు ఆయన కుటుంబ సభ్యుల పేర్ల మీదికి ఎలా మార్పు చెందాయంటూ సంచలన ప్రశ్నలు సంధించారు. అసెంబ్లీలో సమయం తక్కువగా ఉండటం వల్ల ఇవన్నీ 'పార్ట్2' కింద వదిలేశానని, దమ్ముంటే దీనిపై శ్వేతపత్రం విడుదల చేయాలని లేదా సవాలు స్వీకరించాలని సవాల్ విసిరారు. సీఎం రేవంత్ ఆరోపణలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెంటనే స్పందించారు. కేసీఆర్, కేటీఆర్ కుటుంబ ఆస్తులపై నిరాధార ఆరోపణలపై న్యాయ విచారణ జరిపించాలని సవాల్ విసిరారు. ఇదే క్రమంలో మూడు ఫైవ్ స్టార్ హోటళ్ళు తనవేనని చెప్పారు. పక్షం రోజుల క్రితమే తనకు, తన తండ్రి ఉండేందుకు హైదరాబాద్ లో యోగ్యమైన ఇల్లేలేదని ప్రకటించిన కేటీఆర్ వెంటనే ఇపుడు మూడు ఫైవ్ స్టార్ హోటళ్ళు తనవేనని, తాను పాలిటిక్స్ కు రాకుంటే పది చేసేవాడినంటే బడాయికి పోయారు. ఇది ట్రోలర్స్ కు పని కల్పించగా, కేటీఆర్ వివరణతో కిందిస్థాయి క్యాడర్ కూడా షాకైంది. అసెంబ్లీ సమావేశాల నాటి నుండి సొంత ఎజెండా, కార్యాచరణ వదిలేసి పూర్తిగా సీఎం రేవంత్ వేసిన ట్రాప్ లో పడి ఆ బురద కడుక్కోవడానికే సమయమంతా వెచ్చిస్తున్నారు.



సీఎం రేవంత్ రెడ్డి కావాలనే స్థానిక అంశాల కంటే, వ్యక్తిగత ఆస్తులు, ల్యాండ్ డీల్స్ మరియు హైదరాబాద్ రియల్టర్ల ఆరోపణలను తెరపైకి తెచ్చి బీఆర్ఎస్‌ను డిఫెన్స్‌లోకి నెట్టేస్తున్నారనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. దీనివల్ల ప్రతిపక్షం పాలనాపరమైన వైఫల్యాలపై నిలదీసే అవకాశాన్ని కోల్పోయి, కేవలం ఆస్తుల రక్షణ వివరణలకే పరిమితం కావాల్సి వస్తోందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. సిరిసిల్ల లాంటి కార్మిక క్షేత్రంలో చేనేత కార్మికుల సమస్యలు, గల్ఫ్ వలసల ప్రస్తావన తెస్తూనే, మరోవైపు ఆర్థిక మూలాలపై దెబ్బకొట్టేలా రేవంత్ వ్యూహం ఉండటం కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నింపుతోంది.

మరోవైపు సిరిసిల్ల సభ విజయవంతం కావడంతో సిద్దిపేట లో సభకు సీఎం రేవంత్ రెడ్డి రెడీ అవుతున్నారు. గులాబీ పార్టీకి కంచుకోటగా ఉన్న మరో ముఖ్యమైన ప్రాంతం సిద్దిపేట వేదికగా రాజకీయ దాడిని మరింత ఉధృతం చేసేందుకు సీఎం సన్నాహాలు చేస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో పార్టీ పట్టును బిగించడం, కేసీఆర్ ప్రాతినిధ్యం వహించిన, హరీశ్ రావు నియోజకవర్గంగా ఉన్న సిద్దిపేటపై ఫోకస్ పెట్టడం ద్వారా బీఆర్ఎస్‌ను డిఫెన్స్‌లో పడేయాలని కాంగ్రెస్ వ్యూహరచన చేస్తోంది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ముందు (2014కు ముందు) కేటీఆర్, వారి కుటుంబ సభ్యుల ఆర్థిక స్థితిగతులు ఎలా ఉన్నాయి? అధికారంలోకి వచ్చిన దశాబ్ద కాలంలో ఈ స్థాయికి ఆస్తులు ఎలా పెరిగాయి? అనే అంశాన్ని రేవంత్ రెడ్డి పదే పదే తెరపైకి తెస్తున్నారు. ఒక సాధారణ రాజకీయ కుటుంబం లేదా ఉద్యమ నాయకుల కుటుంబం అధికారంలోకి వచ్చాక కార్పొరేట్ స్థాయికి ఎదిగిందనే ప్రచారాన్ని ప్రజల్లోకి బలముగా తీసుకెళ్లడం ద్వారా, బీఆర్ఎస్ నైతికతను దెబ్బతీయాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా, కాంక్రీట్ పేర్లు, నిర్దిష్ట సంస్థలు, భవనాల పేర్లను ప్రస్తావించడం ద్వారా ప్రజల్లో అనుమానాలు బలపడేలా చేయడమే కాంగ్రెస్ వ్యూహం. మరోవైపు, బీఆర్ఎస్ నేతలు ఇవి పూర్తిగా నిరాధారమని, లీగల్‌గా ఎదుర్కొంటామని చెబుతున్నప్పటికీ, ఈ ఆరోపణలు జనంలో చర్చనీయాంశంగా మారాయి. ప్రతిరోజూ వస్తున్న ఆరోపణలకు వివరణ ఇచ్చుకోవాల్సి రావడం వల్ల, బీఆర్ఎస్ ప్రస్తుతం ఆత్మరక్షణ ధోరణిలోకి వెళ్లాల్సి వస్తోంది. ప్రభుత్వంపై ప్రజా సమస్యలు, ఉద్యోగాలు, రైతు సమస్యలు, సంక్షేమ పథకాల అమలు పై పోరాడాల్సిన ప్రతిపక్షం, తమ ఆస్తుల రక్షణ, వివరణల చుట్టూ రాజకీయాలను తిప్పాల్సి రావడం గులాబీ పార్టీకి పెద్ద సవాల్‌గా మారింది. బీఆర్ఎస్‌కు ఎంతో బలమైన కంచుకోటలుగా ఉన్న సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్ ప్రాంతాల్లోనే సీఎం రేవంత్ రెడ్డి అడుగుపెట్టి సవాళ్లు విసరడం వెనుక బలమైన వ్యూహం ఉంది. ఉత్తర తెలంగాణ జిల్లాలపై పట్టు బిగిస్తూ, స్థానిక సంస్థల ఎన్నికల నాటికి కేడర్‌లో జోష్ నింపడం, బీఆర్ఎస్ అగ్రనేతలను వారి సొంత నియోజకవర్గాల్లోనే బిజీగా ఉంచడం దీని ప్రధాన ఉద్దేశంగా కనబడుతోంది.

ఇక ఆంధ్రప్రదేశ్ రాజకీయాల విషయానికొస్తే .. స్థానిక ఎన్నికల రాజకీయం హైకోర్టును దాటి సుప్రీంకోర్టుకు చేరింది. బీసీ రిజర్వేషన్ల అంశం హైకోర్టును దాటి సుప్రీంకు వెళ్ళగా, సుప్రీం తీర్పు వచ్చాకే ఏపీలో స్థానిక ఎన్నికలు జరగనున్నాయి. మదనపల్లె సభలో అనంత్ అంబానీ వ్యాఖ్యలు దేశ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. ఓ వైపు ఉత్తరాంధ్రలో అదానీ, రాయలసీమలో అంబానీ దీర్ఘకాలిక వ్యూహాలు ఆసక్తికరంగా మారాయి. సర్ అంశం దేశాన్ని కుదిపేస్తుండగా, ఎన్నికల ప్రక్రియలో జరిగిన అక్రమాలు కళ్ళకు కడుతున్నాయి. ప్రజల ప్రశ్నలముందు ఎన్నికల కమిషన్ దోషిగా నిలబడుతోంది. అర్హులైన ఓటర్లను. దేశప్రజలను ఓటింగ్ ను తొలగించి ఎన్నికలు నిర్వహించడం ద్వారా ఈసీ నిస్పాక్షికత ప్రశ్నార్థకంగా మారింది. జ్ఞానేశ్‌రాజీనామానే ఈ సమస్య పరిష్కారం కాదు. ప్రజల అనుమానాలు పోవాలంటే, వయోజన ప్రజలందరికీ ఓటు హక్కు కల్పించి దేశవ్యాప్తంగా ఎన్నికలు నిర్వహించాలి. లేకపోతే అనుమానాలు కొనసాగుతాయి. గత కొన్నేళ్ళుగా ఈవీఎంలపై నెలకొన్న అనుమానాలను సర్ బలపరిచి.. ఎన్నికల ప్రక్రియ డొల్లతనాన్ని బయటపెట్టింది.



**బీఆర్ఎస్‌కు ఎంతో బలమైన కంచుకోటలుగా ఉన్న సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్ ప్రాంతాల్లోనే సీఎం రేవంత్ రెడ్డి అడుగుపెట్టి సవాళ్లు విసరడం వెనుక బలమైన వ్యూహం ఉంది. ఉత్తర తెలంగాణ జిల్లాలపై పట్టు బిగిస్తూ, స్థానిక సంస్థల ఎన్నికల నాటికి కేడర్‌లో జోష్ నింపడం, బీఆర్ఎస్ అగ్రనేతలను వారి సొంత నియోజకవర్గాల్లోనే బిజీగా ఉంచడం దీని ప్రధాన ఉద్దేశంగా కనబడుతోంది.**

**రాజకీయ రంగస్థలంపై ఇప్పుడు మాటల యుద్ధం తారాస్థాయికి చేరింది. అధికార పక్షం వేస్తున్న ప్రతి పావు వ్యూహాత్మకంగా మారుతుంటే, ప్రతిపక్షం మాత్రం రక్షణాత్మక ధోరణిలో పడి కొట్టుమిట్టాడుతోంది. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పన్నిన రాజకీయ వలలో గులాబీ పార్టీ నాయకులు చిక్కుకున్నారా? సిరిసిల్ల సభతో కేటీఆర్ టార్గెట్‌గా ఎక్కుపెట్టిన అస్త్రాలు గులాబీదళాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయా? ప్రజాసమస్యలపై పోరాడాల్సిన వేదికలు కాస్తా.. ఆస్తుల పంచాయతీలు, కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్య మాటల తూటాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్నాయి. అసెంబ్లీ సమావేశాల నుండి గేర్ మార్చిన సీఎం రేవంత్ తనదైన దూకుడుతో ప్రతిపక్షాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు.**

**తెలంగాణ రాజకీయాలు మరోసారి గూడెం గుసగుసల నుంచి బహిరంగ సవాళ్ల స్థాయికి చేరాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల గడ్డపైనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఒక దశాబ్ద కాలం పాటు అధికారంలో ఉన్న గులాబీ బాస్ కుటుంబంపై రేవంత్ సంధించిన ఆరోపణలు ఇప్పుడు రాష్ట్రంలో హాట్ టాపిక్‌గా మారాయి.**

**సీఎం రేవంత్ రెడ్డి కావాలనే స్థానిక అంశాల కంటే, వ్యక్తిగత ఆస్తులు, ల్యాండ్ డీల్స్ మరియు హైదరాబాద్ రియల్టర్ల ఆరోపణలను తెరపైకి తెచ్చి బీఆర్ఎస్‌ను డిఫెన్స్‌లోకి నెట్టేస్తున్నారనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. దీనివల్ల ప్రతిపక్షం పాలనాపరమైన వైఫల్యాలపై నిలదీసే అవకాశాన్ని కోల్పోయి, కేవలం ఆస్తుల రక్షణ వివరణలకే పరిమితం కావాల్సి వస్తోంది. సిరిసిల్ల లాంటి కార్మిక క్షేత్రంలో చేనేత కార్మికుల సమస్యలు, గల్ఫ్ వలసల ప్రస్తావన తెస్తూనే, మరోవైపు ఆర్థిక మూలాలపై దెబ్బకొట్టేలా రేవంత్ వ్యూహం ఉండటం కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నింపుతోంది.**

**మరోవైపు సిరిసిల్ల సభ విజయవంతం కావడంతో సిద్దిపేట లో సభకు సీఎం రేవంత్ రెడ్డి రెడీ అవుతున్నారు. గులాబీ పార్టీకి కంచుకోటగా ఉన్న మరో ముఖ్యమైన ప్రాంతం సిద్దిపేట వేదికగా రాజకీయ దాడిని మరింత ఉధృతం చేసేందుకు సీఎం సన్నాహాలు చేస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో పార్టీ పట్టును బిగించడం, కేసీఆర్ ప్రాతినిధ్యం వహించిన, హరీశ్ రావు నియోజకవర్గంగా ఉన్న సిద్దిపేటపై ఫోకస్ పెట్టడం ద్వారా బీఆర్ఎస్‌ను డిఫెన్స్‌లో పడేయాలని కాంగ్రెస్ వ్యూహరచన చేస్తోంది**

**కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా, కాంక్రీట్ పేర్లు, నిర్దిష్ట సంస్థలు, భవనాల పేర్లను ప్రస్తావించడం ద్వారా ప్రజల్లో అనుమానాలు బలపడేలా చేయడమే కాంగ్రెస్ వ్యూహం. మరోవైపు, బీఆర్ఎస్ నేతలు ఇవి పూర్తిగా నిరాధారమని, లీగల్‌గా ఎదుర్కొంటామని చెబుతున్నప్పటికీ, ఈ ఆరోపణలు జనంలో చర్చనీయాంశంగా మారాయి. ప్రతిరోజూ వస్తున్న ఆరోపణలకు వివరణ ఇచ్చుకోవాల్సి రావడం వల్ల, బీఆర్ఎస్ ప్రస్తుతం ఆత్మరక్షణ ధోరణిలోకి వెళ్లాల్సి వస్తోంది. ప్రభుత్వంపై ప్రజా సమస్యలు, ఉద్యోగాలు, రైతు సమస్యలు, సంక్షేమ పథకాల అమలు పై పోరాడాల్సిన ప్రతిపక్షం, తమ ఆస్తుల రక్షణ, వివరణల చుట్టూ రాజకీయాలను తిప్పాల్సి రావడం గులాబీ పార్టీకి పెద్ద సవాల్‌గా మారింది.**

**సర్ అంశం దేశాన్ని కుదిపేస్తుండగా, ఎన్నికల ప్రక్రియలో జరిగిన అక్రమాలు కళ్ళకు కడుతున్నాయి. ప్రజల ప్రశ్నలముందు ఎన్నికల కమిషన్ దోషిగా నిలబడుతోంది. అర్హులైన ఓటర్లను. దేశప్రజలను ఓటింగ్ ను తొలగించి ఎన్నికలు నిర్వహించడం ద్వారా ఈసీ నిస్పాక్షికత ప్రశ్నార్థకంగా మారింది. జ్ఞానేశ్ రాజీనామానే ఈ సమస్య పరిష్కారం కాదు. ప్రజల అనుమానాలు పోవాలంటే, వయోజన ప్రజలందరికీ ఓటు హక్కు కల్పించి దేశవ్యాప్తంగా ఎన్నికలు నిర్వహించాలి.**

# మరీ వేడి టీతో అన్నవాహికకు ముప్పు

, మహా: ఉదయం నిద్రలేవగానే ఒక కప్పు టీ.. పనిలో అలసటగా అనిపిస్తే కాఫీ.. సాయంత్రం మళ్లీ వేడి టీ.. ఇలా రోజులో పలుమార్లు టీ, కాఫీ తాగడం చాలా మందికి అలవాటుగా మారింది. అయితే పానీయం ఏది తాగుతున్నామన్నదే కాదు.. అది ఎంత వేడిగా ఉందన్నదీ ఆరోగ్యపరంగా ముఖ్యమని వైద్య, పరిశోధనా సంస్థలు చెబుతున్నాయి. మరీ వేడిగా ఉన్న పానీయాలను తరచూ తాగే అలవాటు అన్నవాహికపై ప్రభావం చూపే అవకాశం ఉందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థకు చెందిన ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ రీసెర్చ్ ఆన్ క్యాన్సర్ (ఐఏఆర్సీ) 65 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలో తీసుకునే పానీయాలను 'వెరీ హాట్'గా పరిగణిస్తోంది. ఇలాంటి పానీయాల వినియోగం అన్నవాహిక క్యాన్సర్ ముప్పుతో సంబంధం కలిగి ఉండవచ్చని ఐఏఆర్సీ పేర్కొంది.

**వేడి ఎంత ఎక్కువైతే..**

పొగలు కక్కుతున్న టీ లేదా కాఫీని చల్లార్చకుండా వెంటనే తాగడం చాలామందికి సాధారణ అలవాటు. అయితే ద్రవం అధిక ఉష్ణోగ్రతలో ఉన్నప్పుడు నోటి నుంచి కడుపు వరకు వెళ్లే మార్గమైన అన్నవాహికలోని సున్నితమైన కణజాలంపై వేడి ప్రభావం పడుతుంది. ఒక్కసారి వేడి పానీయం తీసుకున్నంత మాత్రాన క్యాన్సర్ వస్తుందని చెప్పలేం. కానీ ఎక్కువ ఉష్ణోగ్రతలోని పానీయాలను దీర్ఘకాలంగా, తరచూ తీసుకోవడం వల్ల ప్రమాదం పెరిగే అవకాశం ఉందని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఐఏఆర్సీ సమీక్షించిన పరిశోధనల్లో పానీయం ఉష్ణోగ్రత పెరిగే కొద్దీ అన్నవాహిక క్యాన్సర్ ప్రమాదం పెరిగినట్లు కొన్ని అధ్యయనాలు గుర్తించాయి. ముఖ్యంగా అన్నవాహికలోని స్క్వామస్ సెల్ కార్సినోమాతో అధిక ఉష్ణోగ్రత పానీయాల సంబంధంపై ఆధారాలు ఉన్నాయి.



**టీ, కాఫీ అసలు సమస్యేనా?**

ఈ అంశంపై చాలామందిలో ఒక అపోహ ఉంది. టీ లేదా కాఫీ తాగితే క్యాన్సర్ వస్తుందని పరిశోధనలు చెప్పడం లేదు. ప్రధానంగా చర్చ జరుగుతున్నది పానీయం ఉష్ణోగ్రత గురించి. ఐఏఆర్సీ పరిశీలనల్లో అత్యంత వేడి పానీయాల విషయంలో ఉష్ణోగ్రత కీలక అంశంగా కనిపించింది. టీ, కాఫీ వంటి పానీయాలను సాధారణంగా తగినంత చల్లారిన తర్వాత తీసుకుంటే పరిస్థితి భిన్నంగా ఉంటుంది. అందువల్ల టీ, కాఫీ పూర్తిగా మానేయాల్సిందేనని ఈ అధ్యయనాలను అర్థం చేసుకోవడం సరికాదు. మరోవైపు సాధారణ టీ, కాఫీ వినియోగం మరియు అన్నవాహిక క్యాన్సర్ మధ్య స్పష్టమైన సంబంధం కనిపించలేదని ఒక పెద్ద యూరోపియన్ అధ్యయనం కూడా తెలిపింది.

**అన్నవాహిక క్యాన్సర్ అంటే..**

నోటి నుంచి తీసుకున్న ఆహారం, ద్రవాలను కడుపుకు చేర్చే పొడవైన గొట్టంలాంటి అవయవమే అన్నవాహిక. ఇందులోని కణాలు అసాధారణంగా పెరగడం ప్రారంభించినప్పుడు అన్నవాహిక క్యాన్సర్ ఏర్పడుతుంది. ఈ క్యాన్సర్‌లో ప్రధానంగా స్క్వామస్ సెల్ కార్సినోమా, అడెనోకార్సినోమా అనే రెండు రకాలు ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా స్క్వామస్ సెల్ కార్సినోమా ఎక్కువగా కనిపిస్తుంది. పొగతాగడం, అధిక మద్యపానం, దీర్ఘకాలిక యాసిడ్ రిఫ్లక్స్, బారెట్ అన్నవాహిక వంటి పరిస్థితులు కూడా ప్రమాదాన్ని పెంచే అంశాలుగా వైద్య సంస్థలు పేర్కొంటున్నాయి.

**ఈ లక్షణాలను నిర్లక్ష్యం చేయొద్దు**

అన్నవాహిక క్యాన్సర్ ప్రారంభ దశల్లో చాలాసార్లు స్పష్టమైన లక్షణాలు కనిపించకపోవచ్చు. వ్యాధి ముదిరిన కొద్దీ మింగడంలో ఇబ్బంది, మింగేటప్పుడు నొప్పి, ఛాతి వెనుక భాగంలో నొప్పి లేదా మంట, తరచూ అజీర్ణం, గుండెల్లో మంట, నిరంతర దగ్గు, గొంతు బొంగురుపోవడం, కారణం లేకుండా బరువు తగ్గడం వంటి సమస్యలు కనిపించవచ్చు. ముఖ్యంగా ఆహారం లేదా నీరు మింగడంలో కొత్తగా ఇబ్బంది ఏర్పడి అది కొనసాగుతున్నట్లయితే నిర్లక్ష్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించడం అవసరం. ఈ లక్షణాలు క్యాన్సర్ వల్లనే వస్తాయని కాదు; ఇతర జీర్ణవ్యవస్థ సమస్యల వల్ల కూడా రావచ్చు. అయితే నిరంతరంగా ఉంటే కారణాన్ని గుర్తించడం ముఖ్యం.

**పొగ, మద్యంతో మరింత ముప్పు**

అన్నవాహిక క్యాన్సర్ ప్రమాదాన్ని కేవలం వేడి పానీయాల కోణంలోనే చూడకూడదు. పొగతాగడం, అధిక మద్యపానం ముఖ్యమైన ప్రమాద కారకాలుగా గుర్తించబడ్డాయి. ముఖ్యంగా పొగతాగడం, మద్యపానం రెండూ కలిసినప్పుడు స్క్వామస్ సెల్ కార్సినోమా ప్రమాదం మరింత పెరుగుతుందని వైద్య పరిశోధనలు సూచిస్తున్నాయి. మరోవైపు దీర్ఘకాలిక గ్యాస్ట్రోఈసోఫేజియల్ రిఫ్లక్స్ వ్యాధి, బారెట్ అన్నవాహిక, అధిక బరువు వంటి అంశాలు అన్నవాహిక అడెనోకార్సినోమా ప్రమాదంతో సంబంధం కలిగి ఉంటాయి. అందుకే ఆరోగ్యకరమైన జీవనశైలి, పొగతాగడం మానేయడం, మద్యపానాన్ని తగ్గించడం వంటి చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

**చల్లారిన తర్వాతే తాగడం మంచిది**

టీ, కాఫీ లేదా ఇతర వేడి పానీయాలను నోరు, నాలుక కాలేంత వేడిగా ఉన్నప్పుడే తాగకుండా కొంతసేపు చల్లార్చిన తర్వాత తీసుకోవడం సులభమైన జాగ్రత్త. ముఖ్యంగా రోజులో పలుమార్లు అత్యంత వేడి పానీయాలు తీసుకునే అలవాటు ఉన్నవారు ఈ పద్ధతిని పాటించడం ద్వారా అధిక ఉష్ణోగ్రతకు గురయ్యే అవకాశాన్ని తగ్గించుకోవచ్చు. పానీయం తాగుతున్నప్పుడు నోటిలో లేదా గొంతులో మంట కలిగితే అది మరీ వేడిగా ఉందనే సంకేతంగా భావించాలి. టీ లేదా కాఫీ తాగడాన్ని పూర్తిగా మానేయడం కంటే, తగిన ఉష్ణోగ్రతకు వచ్చిన తర్వాత తీసుకోవడం ముఖ్యం.

## అధ్యయనాలపై స్పష్టత అవసరం

అత్యంత వేడి పానీయాలపై ఐఏఆర్సీ చేసిన వర్గీకరణను కూడా సరైన విధంగా అర్థం చేసుకోవాలి. 'గ్రూప్ 2ఏ' అంటే మానవుల్లో క్యాన్సర్‌కు కారణమయ్యే అవకాశం ఉందని బలమైన ఆధారాలు ఉన్నాయని సూచించే వర్గీకరణ. ఇది ఎంత మొత్తంలో, ఎన్ని సంవత్సరాలు వేడి పానీయం తాగితే క్యాన్సర్ వస్తుందో నిర్దిష్టంగా చెప్పదు. అలాగే ఈ వర్గీకరణ ప్రమాదం ఎంత ఎక్కువ అన్నదాన్ని కూడా తెలియజేయదు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న పరిశోధనల ఆధారంగా అత్యంత వేడి పానీయాలు మరియు అన్నవాహిక క్యాన్సర్ మధ్య సంబంధం ఉన్నట్లు శాస్త్రీయ ఆధారాలు సూచిస్తున్నాయి. అందువల్ల భయపడటం కంటే జాగ్రత్తగా ఉండటం, పానీయాలను కొద్దిగా చల్లార్చి తీసుకోవడం, పొగతాగడంమద్యపానం వంటి ఇతర ప్రమాద కారకాలను దూరంగా ఉంచడం ఆరోగ్యపరంగా ఉపయోగకరమైన చర్యలు.



## పరిశుభ్రతే ఆరోగ్యానికి మూలాధారం

- మందమర్రి ఏరియా జీఎం ఎన్ రాధాకృష్ణ

**మందమర్రి, మహా** : పరిశుభ్రతే ఆరోగ్యానికి మూలాధారమని, పూజ్య బాపూజీ కలలు కన్న స్వచ్ఛ భారత స్వప్నాన్ని సాకారం చేసే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్ రాధాకృష్ణ అన్నారు. శనివారం ఏరియా జీఎం కార్యాలయ ఆవరణలో స్పెషల్ క్యాంపెయిన్6 - స్వచ్ఛ స్వచ్ఛ భారత్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ కేవలం రాజకీయ స్వాతంత్ర్యమే కాకుండా పరిశుభ్రమైన, అభివృద్ధి చెందిన దేశాన్ని ఆకాంక్షించారని, ఆయన స్ఫూర్తితో స్వచ్ఛ తెలంగాణ లక్ష్యాన్ని సాధిస్తూ స్వచ్ఛ భారత్ రూపకల్పనలో సింగరేణి కుటుంబాలన్నీ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. పరిసరాల అపరిశుభ్రత వల్ల వ్యాధులు ప్రబలుతాయని, ఇది వ్యక్తిగత, సమాజ ఆరోగ్యానికి హాని కలిగిస్తుందని హెచ్చరించారు. వారానికి కనీసం రెండు గంటలు శ్రమదానం చేసి ఇల్లు, పరిసరాలు, కార్యాలయాలను శుభ్రంగా ఉంచుకోవాలని, మనం పాటించే పరిశుభ్రత, క్రమశిక్షణ రాబోయే తరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. కార్యాలయాలు, గనులు, పని ప్రాంతాల్లో ఆహ్లాదకరమైన, పరిశుభ్రమైన వాతావరణం ఉంటే ఉద్యోగుల పనితీరు, ఉత్పాదకత మెరుగవుతాయని, పరిశుభ్రతను నిత్యకృత్యంగా మలుచుకుని రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం అధికారులు, ఉద్యోగులతో స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం జి.ఎల్. ప్రసాద్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, డీజీఎం (పర్సనల్) సిహెచ్. అశోక్, ఎన్విరాన్ మెంట్ అధికారి కాతం వెంకట్ రెడ్డి, సీనియర్ పీఓ ఎం. కార్తీక్, జీఎం స్ట్రక్చర్ కమిటీ మెంబర్ సి.వి. రమణ, జీఎం ఆఫీస్ ఫిట్ సెక్రటరీ గీతిక, ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ బీసీ సమావేశంలో రసాభాస

- నాయకులను ఆహ్వానించలేదన్న వివాదం
- ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట, దాడులు.




**పెద్దపల్లి మహా**: పెద్దపల్లి పట్టణంలోని ఆర్ఆర్ గార్డెన్‌లో శనివారం నిర్వహించిన బీఆర్ఎస్ బీసీ సమావేశం రసాభాసగా మారింది. బీసీ వర్గాలకు చెందిన పలువురు నాయకులను సమావేశానికి ఆహ్వానించలేదన్న అంశం వివాదానికి దారితీయడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మాటామాటా పెరగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారి తోపులాట, ఘర్షణకు దారితీసిన సంఘటన చోటు చేసుకుంది. సమావేశానికి గంట రాములు యాదవ్, దాసరి ఉష తదితర బీసీ నాయకులను ఆహ్వానించలేదన్న అంశంపై కొందరు నాయకులు, కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. బీసీ నాయకులందరినీ కలుపుకొని సమావేశం నిర్వహించాల్సిన సమయంలో కొందరిని విస్మరించడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో సమావేశంలో పాల్గొన్న కొందరు నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం ఇరువర్గాలు పరస్పరం తోపులాటకు దిగడంతో కొద్దిసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది. ఒకరిపై ఒకరు రాళ్లు, కుర్చీలతో దాడులు చేసుకున్నారు. దీంతో సమావేశానికి హాజరైన కార్యకర్తలు, నాయకులు ఆందోళనకు గురయ్యారు.

**నాయకత్వంపై అసంతృప్తి!?**

సమావేశంలో కొందరు బీఆర్ఎస్ బీసీ నాయకులు మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి నాయకత్వంపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలోని అన్ని వర్గాల నాయకులను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లడం లేదని వారు ఆరోపించినట్లు సమాచారం. పార్టీ కార్యక్రమాల్లో బీసీ నాయకులందరికీ సముచిత ప్రాధాన్యం కల్పించాలని వారు కోరినట్లు తెలిసింది. అన్ని వర్గాలను కలుపుకొని పార్టీని ముందుకు తీసుకెళ్లకపోవడం వల్లే గత ఎన్నికల్లో పార్టీకి ప్రతికూల ఫలితాలు ఎదురయ్యాయని కొందరు నాయకులు సమావేశంలో వ్యాఖ్యానించినట్లు సమాచారం. బీసీ ఐక్యతపై చర్చించాల్సిన వేదికలోనే విభేదాలు! బీసీ వర్గాల సమస్యలు, రాజకీయ ప్రాతినిధ్యం, పార్టీ బలోపేతం తదితర అంశాలపై చర్చించాల్సిన సమావేశం నాయకుల మధ్య విభేదాలతో ఉద్రిక్తంగా మారడం చర్చనీయాంశంగా మారింది. బీసీ నాయకులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి పార్టీని బలోపేతం చేయాల్సిన సమయంలో అంతర్గత విభేదాలు బహిర్గతం కావడంపై పలువురు కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. సమావేశం సందర్భంగా చోటుచేసుకున్న ఘర్షణతో కొంతసేపు ఆర్ఆర్ గార్డెన్ ప్రాంగణంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.తాజా పరిణామాలతో పెద్దపల్లి బీఆర్ఎస్‌లో బీసీ నాయకుల మధ్య సమన్వయం, పార్టీ అంతర్గత వ్యవహారాలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. సమావేశంలో జరిగిన పరిణామాలపై సంబంధిత నాయకుల పూర్తి స్పందన వెలువడాల్సి ఉంది.

**బీఆర్ఎస్‌లో బీసీలకు ప్రాధాన్యత లేదా!? గంట రాములు యాదవ్, దాసరి ఉష**

బీసీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి బీసీ నాయకులు, కార్యకర్తలకు సమాచారం ఇవ్వకపోవడంపై వివాదం నెలకొంది. దీనిపై ప్రశ్నించిన కార్యకర్తలపై దాడి జరిగిందని, పలువురికి గాయాలయ్యాయని వారు ఆరోపించారు. గాయపడిన వారిని గంట రాములు దాసరి ఉష ఆసుపత్రి నందు పరామర్శించారు. "ఇది వ్యక్తిగత పార్టీ కాదు.. బీఆర్ఎస్ పార్టీ" అంటూ దాసరి మనోహర్‌రెడ్డిని ఉద్దేశించి బీసీ కార్యకర్తలు ప్రశ్నించారు. సీనియర్ బీసీ నాయకుడు గంట రాములు యాదవ్ పాటు ఏళ్లుగా పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలకు కనీస సమాచారం ఇవ్వకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## రేషన్ కార్డుదారులకు కేంద్రం షాక్

- ఆరు నెలలు వాడని కార్డులు రేషన్ బంద్

**వరంగల్, మహా ;** ఆరు నెలలు వాడని రేషన్ కార్డు దారులకు రేషన్ సరఫరా బంద్ చేయాలని కేంద్రం యోచిస్తున్నది. కేంద్ర ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు షాకిచ్చే యోచనలో ఉందని సమాచారం. ఆరు నెలలుగా వరుసగా రేషన్ తీసుకోని వారి కార్డులను తాత్కాలికంగా నిలిపివేయనుంది. అక్టోబర్ నుండి దాదాపు 1.58 కోట్ల కార్డులను నిలిపివేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేసుకుంటే కార్డులు మళ్లీ యాక్టివేట్ అవుతాయి. మరణించిన, డూప్లికేట్, నకిలీ పేర్లతో ఉన్న కార్డులను గుర్తించి తొలగించే ప్రక్రియలో భాగంగా ఈ చర్యలు చేపట్టనున్నారు. మేరా రేషన్ యాప్ లేదా మీ సేవా కేంద్రాల ద్వారా ఈకేవైసీ పూర్తి చేసుకోవచ్చునని తెలిపారు.





## నేరాల నియంత్రణే మా లక్ష్యం

- మంచిర్యాల మార్కెట్, లాడ్జీలు, బ్యాంకులు, గోల్డ్ షాపుల వద్ద తనిఖీలు
- మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్

**మంచిర్యాల, మహా** : నేరాల నియంత్రణే మా లక్ష్యమని మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ తెలిపారు. శనివారం మంచిర్యాల పట్టణంలోని మార్కెట్, వాణిజ్య సంస్థలు, లాడ్జీలు, బ్యాంకులు, గోల్డ్ షాపులు తదితర ముఖ్య ప్రాంతాల్లో పోలీస్ సిబ్బందితో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ బ్యాంకులు, బంగారు దుకాణాలను లక్ష్యంగా చేసుకుని జరిగే చోరీలు, దోపిడీలను ముందుగానే అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. బ్యాంకులకు వచ్చే ఖాతాదారుల దృష్టి మళ్లించి నగదు, విలువైన వస్తువులు అపహరించే ముఠాల కదలికలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ముఖ్య ప్రాంతాలు, రహదారులు, సరిహద్దుల్లో ఆర్మర్డ్ పోలీస్ సిబ్బంది, ప్రత్యేక బృందాలతో విస్తృత తనిఖీలు చేస్తున్నామన్నారు. వాహనదారులు తప్పనిసరిగా సరైన నంబర్ ప్లేట్ ఏర్పాటు చేసుకోవాలని, నంబర్ ప్లేట్ వంచడం, మార్చడం, లేకుండా తిరగడం చేయరాదని సూచించారు. నంబర్ ప్లేట్ లేని లేదా స్పష్టంగా కనిపించని వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. పత్రాలన్నీ సక్రమంగా ఉంటే తనిఖీల సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. మంచిర్యాల మహారాష్ట్ర సరిహద్దుకు సమీపంలో ఉండటంతో నేరాలకు పాల్పడి సరిహద్దు దాటి పారిపోయే వారిని అరికట్టేందుకు సరిహద్దుల్లో నిఘా పటిష్టం చేశామని, పోలీసులు 24x7 అప్రమత్తంగా ఉంటారని పేర్కొన్నారు. కమిషనరేట్ పరిధిలోని ముఖ్య ప్రాంతాలు, రహదారులు, సరిహద్దుల్లో ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల పట్టణ సీఐ ప్రమోద్ రావు, ట్రాఫిక్ పోలీసులు, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.



## ఉద్యోగులకు ఆరోగ్య పథకం వరప్రదాయిని

**కరీంనగర్, మహా**: ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్) కీలకంగా ఉపయోగపడుతోందని ఉద్యోగులు సంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణ ఎన్జీవోల సంఘం, కరీంనగర్ జిల్లా ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి నాయకత్వంలో, చైర్మన్ మారం జగదీశ్వర్ పర్యవేక్షణలో నగరంలోని పలు ఆసుపత్రులను సందర్శించారు. ఉద్యోగుల ఆరోగ్య పథకం అమలు తీరు, వైద్య సేవలు, చికిత్స సమయంలో ఎదురవుతున్న సమస్యలపై ఆసుపత్రుల యాజమాన్యాలతో చర్చించారు. సన్‌రైజ్ ఆసుపత్రిలో నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో పాల్గొని సేవలపై వివరాలు తెలుసుకున్నారు. అపోలో రీచ్, మెడికవర్, స్టార్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న ఉద్యోగులను కలిసి ఈహెచ్ఎస్ ద్వారా అందుతున్న సేవలపై ఆరా తీశారు. గుండె చికిత్సలు, మోకాళ్ల మార్పిడి వంటి శస్త్ర చికిత్సలకు మెరుగైన సేవలు అందుతున్నాయని ఉద్యోగులు తెలిపారు. ఆరోగ్య పథకం నిబంధనల ప్రకారం అదనపు రుసుములు వసూలు చేయకుండా వైద్యం అందిస్తున్నామని ఆసుపత్రుల యాజమాన్యాలు తెలిపాయి. సామాజిక మాధ్యమాల్లో వచ్చే నిర్ధారణ లేని ప్రచారాన్ని నమ్మకుండా సమస్యలను నేరుగా జేఏసీ దృష్టికి తీసుకురావాలని నాయకులు సూచించారు.

## విద్యార్థులకు షీ టీమ్ అవగాహన సదస్సు



**పెద్దపల్లి మహా** : రామగుండం సీపీ ఆదేశాల మేరకు పెద్దపల్లి షీ టీమ్ ఆధ్వర్యంలో పెద్దపల్లిలోని మదర్ థెరిస్సా ఇంజినీరింగ్ కాలేజీలో విద్యార్థులకు షీ టీమ్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్ ఇన్‌చార్జి ఎస్ఐ లావణ్య మాట్లాడుతూ.. విద్యార్థులు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోక్సో చట్టం, సోషల్ మీడియా ప్రభావం, టీనేజ్ వయస్సులో చోటుచేసుకునే శారీరక, మానసిక మార్పులు, విద్యార్థుల ప్రవర్తనా నియమాలు, మహిళల భద్రత, ఆన్‌లైన్ మోసాలు, డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. మహిళల రక్షణ కోసం ప్రతిరోజూ బస్టాండ్‌లు, ప్రధాన చౌరస్తాలు, జనసమీకరణ ప్రాంతాలు, కళాశాలల వద్ద షీ టీమ్ నిఘా ఉంటుందని తెలిపారు. ఎవరైనా వేధింపులకు గురైతే మహిళలు, విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యను తెలియజేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. అలాగే మహిళలకు ప్రమాదం ఎదురైనా, ఎవరైనా బెదిరింపులకు గురిచేసినా వెంటనే 100/112కు డయల్ చేయాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాలకు గురైన వారు వెంటనే 1930కు ఫోన్ చేయాలని తెలిపారు. మహిళలు ప్రయాణ సమయంలో భద్రత కోసం టి సేఫ్ యాప్ ను వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ టి. శ్రీనివాస్, ఉపాధ్యాయులు, షీ టీమ్ సభ్యులు మౌనిక, స్నేహలత, సురేష్ తదితరులు పాల్గొన్నారు.







## నవ మహిళా సాధికార కేంద్రంలో చెక్కుల పంపిణీ

**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: పాల్వంచ నవ లిమిటెడ్ సామాజిక కార్యక్రమాలలో భాగంగా ఏర్పాటు చేసిన నవ మహిళా సాధికార కేంద్రంలో తాటి ఆకుల కళాకృతులు విక్రయించడం ద్వారా వచ్చిన రూ.2,58,470 నగదు, యూనిఫామ్స్ కుట్టడం ద్వారా వచ్చిన రూ.1,01,655 నగదు మొత్తం రూ.3,60,125ను ప్రమోటర్ రమా దేవినేని చెక్కులను చేతి వృత్తుల కళాకారులకు శనివారం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా రమా దేవినేని మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబం సమాజం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుడాలని ఆ కుటుంబం ఎప్పుడూ ఆనందమయంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అముద, స్వరూపరాణి, అరుణ, బి.అరుణ, శిరీష, దివ్య, కవిత విద్యార్థులు పాల్గొన్నారు.

## నయారా బంకుల్లో పెట్రోల్, డీజిల్ భారం

హైదరాబాద్, మహా: ప్రైవేట్ రంగ ఇంధన విక్రయ సంస్థ నయారా ఎనర్జీ వాహనదారులకు షాకిచ్చింది. పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. లీటర్ పెట్రోల్‌పై రూ.5, డీజిల్‌పై రూ.3 చొప్పున పెంచింది. సవరించిన ధరలు అక్టోబర్ 3 నుంచి దేశవ్యాప్తంగా నయారా ఎనర్జీ బంకుల్లో అమల్లోకి వచ్చాయి. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు, శుద్ధి చేసిన పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెరగడంతో మార్జిన్‌పై ఒత్తిడి పెరిగిందని, ఈ నేపథ్యంలో ధరలను సవరించినట్లు సంస్థ వర్గాలు వెల్లడించాయి.దేశవ్యాప్తంగా నయారా ఎనర్జీకి సుమారు 7,108 ఇంధన విక్రయ కేంద్రాలు ఉన్నాయి. తాజా పెంపు అన్ని బంకుల్లో వర్తించనుంది. అయితే రాష్ట్రాల వారీగా వసూలయ్యే వ్యాట్, డీలర్ కమిషన్, రవాణా వ్యయాల కారణంగా వినియోగదారులు చెల్లించే తుది ధరల్లో తేడాలు ఉండనున్నాయి. మరోవైపు ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం వంటి ప్రభుత్వ రంగ సంస్థలు ప్రస్తుతం ధరలను పెంచలేదు. దీంతో ఆయా సంస్థల బంకులతో పోలిస్తే నయారా బంకుల్లో ఇంధనం కొనుగోలు ఖర్చు పెరగనుంది.ఈ ఏడాది నయారా ధరలను సవరించడం ఇది మూడోసారి. మార్చి 26న పెట్రోల్‌పై రూ.5, డీజిల్‌పై రూ.3 పెంచిన సంస్థ.. జూలై 1న అంతర్జాతీయ ధరల తగ్గుదల నేపథ్యంలో అదే మొత్తంలో ధరలను తగ్గించింది. తాజా పెంపుతో జూలైలో తగ్గించిన ధరలు మళ్లీ మార్చి నాటి స్థాయికి చేరాయి.




## గురునానక్ విద్యాసంస్థల్లో పూర్వ విద్యార్థుల సందడి..

- 25 ఏళ్ల అనుబంధానికి ప్రతీకగా ఘనంగా సమ్మేళనం
- దేశ విదేశాల నుంచి తరలివచ్చిన పూర్వ విద్యార్థులు

**ఇబ్రహీంపట్నం అక్టోబర్ 3 మహా**: గురునానక్ విద్యాసంస్థల ప్రాంగణం పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికతో సందడిగా మారింది. "25 సంవత్సరాలు - ఒకే కుటుంబం" అనే సందేశంతో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరిగింది. ఇబ్రహీంపట్నం మున్సిపల్ పరిధిలోని, గురునానక్ విద్యాసంస్థల ప్రాంగణం పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికతో సందడిగా మారింది. వివిధ విద్యా సంవత్సరాలు, విభాగాలకు చెందిన పూర్వ విద్యార్థులు దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు విదేశాల నుంచి కూడా ప్రత్యేకంగా హాజరై తమ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన గురునానక్ సంస్థల ఉపాధ్యక్షుడు, విశ్వవిద్యాలయ ఛాన్సలర్ సర్దార్ గగన్‌దీప్ సింగ్ కోహ్లీ మాట్లాడుతూ... పూర్వ విద్యార్థులు విద్యాసంస్థతో కొనసాగిస్తున్న అనుబంధం అభినందనీయమన్నారు. విద్యాసంస్థ అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల భాగస్వామ్యం మరింత పెరగాలని ఆకాంక్షించారు.

**ఒకచోట చేరి జ్ఞాపకాలను పంచుకున్నారు**

"25 సంవత్సరాలు - ఒకే కుటుంబం" అనే నినాదంతో నిర్వహించిన సామూహిక ఛాయాచిత్ర కార్యక్రమం పూర్వ విద్యార్థుల్లో ప్రత్యేక ఉత్సాహాన్ని నింపింది. పాత స్నేహితులు, అధ్యాపకులు ఒకచోట చేరి జ్ఞాపకాలను పంచుకోవడం ఆత్మీయ వాతావరణాన్ని తీసుకొచ్చింది. ఈ సందర్భంగా విద్యాసంస్థలో విద్యనభ్యసించి వివిధ రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదిగిన పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను వివరించారు. దేశ, విదేశాల్లోని ప్రముఖ సంస్థల్లో పనిచేస్తున్న వారు తమ వృత్తి ప్రయాణాన్ని విద్యార్థులతో పంచుకోవడం కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. నవంబర్ 20న నిర్వహించనున్న గురునానక్ విద్యాసంస్థల రజతోత్సవ వేడుకలకు ఈ సమ్మేళనం ముందస్తు కార్యక్రమంగా నిలిచిందని తెలిపారు.

## విద్యా వైద్యం పైనే ప్రధాన ఫోకస్

- తెలంగాణ రక్షణ సేన పార్టీ జిల్లా అధ్యక్షులు
- సముద్రాల క్రాంతి కుమార్

**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: ప్రతి పేదవాడికి విద్య వైద్యం అనేది ఉచితంగా అందించాలన్నదే తెలంగాణ రక్షణ సేన పార్టీ ప్రధాన లక్ష్యమని ఆ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు సముద్రాల క్రాంతి కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని ఒక హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రక్షణ సేన పార్టీ అధికారంలోకి వస్తే విద్యా వైద్యం అనేది ఉచితంగా అందించడం జరుగుతుందని తెలంగాణ రక్షణ సేన పార్టీ వ్యవస్థాపకులు కల్వకుంట్ల కవిత ఇప్పటికే స్పష్టం చేయడం జరిగిందన్నారు. పేదవారు కార్పొరేట్ వైద్యం చేయించుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. అంతేకాకుండా పై చదువులకు సైతం పేదవారు ముందుకు వెళ్లలేని పరిస్థితి ఉందని వీటిని దృష్టిలో పెట్టుకొని తమ పార్టీ అధికారంలోకి వస్తే ఉచితంగా అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు దారుణంగా ఉన్నాయన్నారు. సమస్యల మధ్య విద్యార్థులు చదువులు సాగించాల్సిన దుస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం పాఠశాలలను బలోపేతం చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు సరిగ్గా లేరని ఖాళీలు ఉన్నచోట ఉపాధ్యాయులను భర్తీ చేస్తే పేద విద్యార్థులకు మంచి విద్య అందడంతో పాటుగా విద్యార్థుల భవిష్యత్తు బంగారంగా ఉంటుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ స్పందించి ప్రభుత్వ విద్యాలయాలను బలోపేతం చేయడంతో పాటు కనీస వసతులు కల్పించాలని కోరారు. ప్రభుత్వ వైద్యం కూడా అదే దారిలో ఉందన్నారు. ఆస్పత్రులలో మందుల కొరత తీవ్రంగా ఉందని తెలిపారు. ముఖ్యమైన విభాగాలకు వైద్యులు లేరని తెలిపారు. తక్షణమే ప్రభుత్వాసుపత్రులలో న్యూరో ఫిజీషియన్ సర్జన్ తో పాటు ఎండి వైద్యులను ప్రభుత్వం నియమించాలని డిమాండ్ చేశారు. రక్త పరీక్షలు కూడా సరిగ్గా చేయడం లేదని వివరించారు. సింగరేణిలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇటీవల పార్టీ వ్యవస్థాపకులు కల్వకుంట్ల కవిత సింగరేణి బాయి బాట చేపట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమం సందర్భంగా కార్మికులకు సంబంధించిన అనేక సమస్యలు వెలుగులోకి రావడం జరిగిందని వాటి పరిష్కారానికి కవిత విశేష కృషి చేస్తుందని తెలిపారు. సింగరేణిలో ఆగిపోయిన మెడికల్ బోర్డును కొనసాగించాలని కవితమ్మ డిమాండ్ చేసిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. సింగరేణికి ప్రభుత్వం చెల్లించాల్సిన 50 వేల కోట్ల రూపాయలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మారుపేర్ల సమస్యను కూడా పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికుల సొంతింటి కలను నెరవేర్చాలని తెలిపారు. సింగరేణి ఆసుపత్రులలో కార్పొరేట్ సేవలు కల్పించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికి సంబంధించిన సీతారామ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలని కోరారు. రాష్ట్రంలో కొత్త పరిశ్రమలను నెలకొల్పి యువతకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. సింగరేణి కంపెనీలో ఉద్యోగుల సంఖ్య తగ్గిపోతుందన్నారు. తక్షణమే ప్రభుత్వ స్పందించి కొత్త బొగ్గుగనులకు శ్రీకారం చుట్టి కార్మికుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ అదుపుతప్పిందన్నారు. బయ్యారం ఉక్కు పరిశ్రమను ఏర్పాటుచేసి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు. కొత్తగూడెం జిల్లా కేంద్రంలో క్రమబద్ధీకరణ ప్రక్రియను తక్షణమే కొనసాగించాలన్నారు. ఆదివాసీలకు రక్షణ లేదన్నారు. పట్టాలున్న వారు పోడు చేసుకుంటుంటే ఫారెస్ట్ అధికారులు ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. ప్రజా సమస్యలపై తెలంగాణ రక్షణ సేన పార్టీ ఫోకస్ పెట్టి పరిష్కారానికి కృషి చేస్తుందని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో పార్టీ నాయకుడు వీరన్నతో పాటు తదితరులు పాల్గొన్నారు.




## 174 మంది ప్రాణాలను కాపాడిన ధైర్యసాహసం అభినందనీయం

- ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి...

**కుషాయిగూడ, మహా** : కీలక సమయంలో సమయస్ఫూర్తితో వ్యవహరించి 174 మంది ప్రాణాలను కాపాడేందుకు కృషి చేసిన కెప్టన్ స్మిత్ మచ్చర్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అభినందించారు. మల్లాపూర్ ఎలిఫెంట్ సర్కిల్ సమీపంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లాపూర్ ఆంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం క్యాప్టెన్ స్మిత్ మచ్చర్ ధైర్యసాహసం, విధి నిబద్ధత, సమయస్ఫూర్తిని కొనియాడారు. ఆపద సమయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించి మానవ ప్రాణాలను కాపాడేందుకు చేసిన ప్రయత్నం అభినందనీయమన్నారు. మనిషి జీవితం ఎంతో విలువైనదని, ఆపద సమయంలో సమయస్ఫూర్తితో స్పందించి ప్రాణాలను కాపాడేందుకు చేసిన ప్రయత్నం గొప్ప మానవతా సేవ అని పేర్కొన్నారు. క్యాప్టెన్ స్మిత్ మచ్చర్ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షిస్తూ స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సౌర విద్యుత్తుతో కాలుష్యానికి చెక్

- సహజ వనరులను భావితరాలకు కాపాడుకోవచ్చు
- ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



**కుషాయిగూడ, మహా** : కాలుష్యం లేని సౌర విద్యుత్తును వినియోగించడం ద్వారా సహజ వనరులను భావితరాలకు పొదుపు చేయవచ్చని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. సౌర విద్యుత్తు వినియోగంతో వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడంతోపాటు విద్యుత్తు బిల్లులను తగ్గించుకోవచ్చన్నారు. మౌలాలి హౌసింగ్ బోర్డు విద్యుత్ శాఖ కార్యాలయంలో శనివారం సేవా సేతు అభియాన్, ప్రధానమంత్రి సూర్యఘర్ బిజిలీ యోజనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇళ్లపై సౌర విద్యుత్తు వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్తు ఖర్చులను తగ్గించుకోవచ్చన్నారు. ఉత్పత్తి చేసిన విద్యుత్తులో మిగులు విద్యుత్తును గ్రిడ్‌కు సరఫరా చేస్తే నెట్ మీటరింగ్ ద్వారా అదనపు ప్రయోజనం పొందవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ సౌర విద్యుత్తు వినియోగంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బండారి నీలం రెడ్డి మాట్లాడుతూ సౌర విద్యుత్తుతో నెలవారీ విద్యుత్తు వినియోగాన్ని, బిల్లులను తగ్గించుకోవచ్చన్నారు. విద్యుత్తు శాఖ చీఫ్ ఇంజనీర్ రమేష్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి సౌర విద్యుత్తును అందించేందుకు కేంద్ర ప్రభుత్వం సేవా సేతు అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. విద్యుత్తు శాఖ పర్యవేక్షణ ఇంజనీర్ వెంకన్న మాట్లాడుతూ సౌర విద్యుత్తు ఏర్పాటుకు బ్యాంకులు రుణ సదుపాయం కల్పిస్తున్నాయని తెలిపారు. డిప్యూటీ ఇంజనీర్ ఎండీ అన్వర్ పాషా మాట్లాడుతూ సౌర విద్యుత్తుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. విద్యుత్తు ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు ముత్యం వెంకన్నగౌడ్ మాట్లాడుతూ సౌర విద్యుత్తు వినియోగంతో పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తోడ్పడాలని అన్నారు. కార్యక్రమంలో ఐల చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, జేరిపోతుల ప్రభుదాస్, తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వంజరి ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే

రాజేంద్రనగర్ మహా ; శంషాబాద్ సర్కిల్లో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్,తన అనుచరులతో కలిసి 2,88 కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి పనులను శనివారం ప్రారంభించారు. శంషాబాద్ జీహెచ్ఎంసీ సర్కిల్ లో వార్డు 118,119 కొత్తగూడ, సంఘీ గుడ లో 2,88 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించనున్న స్టార్మ్ వాటర్ డ్రైన్' (వరద నీటి కాలువ) పనులను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రారంభించారు. వర్షాకాలంలో ప్రజల సౌకర్యార్థం, వరద నీటి ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు చేపట్టిన ఈ శంకుస్థాపన కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, జీహెచ్ఎంసీ అధికారులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## డంపింగ్ యార్డులో విద్యుత్ షాక్, ఒకరి మృతి

- బాధిత కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలంటూ ఎమ్మెల్యే ఆందోళన

**కుషాయిగూడ, మహా** : సాజెట్ డంపింగ్ యార్డులో బిన్ బిన్ మెషిన్ వద్ద విద్యుత్ షాక్‌కు గురై శివ అనే వ్యక్తి మృతి చెందిన ఘటనపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనకు నిరసనగా డంపింగ్ యార్డు వద్ద ధర్నా నిర్వహించి, శివ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డులో పనిచేస్తున్న కార్మికుల భద్రతకు తగిన చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ విషాద ఘటన చోటుచేసుకున్నట్లు ఆరోపిస్తూ, ఘటనకు దారితీసిన కారణాలపై సమగ్ర విచారణ జరిపించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. శివ కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారం అందించాలని, కుటుంబంలో ఒకరికి తగిన ఉపాధి లేదా జీవనోపాధికి భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. జీహెచ్ఎంసీ అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్, బిన్ బిన్ మెషిన్ నిర్వహణ సంస్థ ప్రతినిధులు, ఇతర బాధ్యుల పాత్రపై పూర్తిస్థాయి విచారణ జరిపి, తప్పిదాలు తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని బండారి లక్ష్మారెడ్డి కోరారు. అలాగే డంపింగ్ యార్డులోని అన్ని యంత్రాలు, విద్యుత్ వ్యవస్థలు, వైరింగ్, ఎర్తింగ్, భద్రతా ప్రమాణాలను తక్షణమే పరిశీలించి, లోపాలను వెంటనే సరిచేయాలని సూచించారు. కార్మికుల భద్రతకు అవసరమైన రక్షణ పరికరాలు, భద్రతా చర్యలు తప్పనిసరిగా అమలు చేయాలన్నారు.

## డంపింగ్ యార్డులో విద్యుత్ షాక్, ఒకరి మృతి

- బాధిత కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలంటూ ఎమ్మెల్యే ఆందోళన



**కుషాయిగూడ, మహా** : సాజెట్ డంపింగ్ యార్డులో బిన్ బిన్ మెషిన్ వద్ద విద్యుత్ షాక్‌కు గురై శివ అనే వ్యక్తి మృతి చెందిన ఘటనపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనకు నిరసనగా డంపింగ్ యార్డు వద్ద ధర్నా నిర్వహించి, శివ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డులో పనిచేస్తున్న కార్మికుల భద్రతకు తగిన చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ విషాద ఘటన చోటుచేసుకున్నట్లు ఆరోపిస్తూ, ఘటనకు దారితీసిన కారణాలపై సమగ్ర విచారణ జరిపించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. శివ కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారం అందించాలని, కుటుంబంలో ఒకరికి తగిన ఉపాధి లేదా జీవనోపాధికి భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. జీహెచ్ఎంసీ అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్, బిన్ బిన్ మెషిన్ నిర్వహణ సంస్థ ప్రతినిధులు, ఇతర బాధ్యుల పాత్రపై పూర్తిస్థాయి విచారణ జరిపి, తప్పిదాలు తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని బండారి లక్ష్మారెడ్డి కోరారు. అలాగే డంపింగ్ యార్డులోని అన్ని యంత్రాలు, విద్యుత్ వ్యవస్థలు, వైరింగ్, ఎర్తింగ్, భద్రతా ప్రమాణాలను తక్షణమే పరిశీలించి, లోపాలను వెంటనే సరిచేయాలని సూచించారు. కార్మికుల భద్రతకు అవసరమైన రక్షణ పరికరాలు, భద్రతా చర్యలు తప్పనిసరిగా అమలు చేయాలన్నారు.

## ఇంటర్ బోర్డు కార్యదర్శికి ఫిర్యాదు: ఎన్ఎస్ యుఐ

- దనిక్ భారత్, లామెంటరీ కాలేజీలపై తక్షణ చర్యలు తీసుకోవాలి
- బొంగ్లూర్, ఆదిబట్ల ప్రాంతాల్లోని అనుమతులేని కాలేజీలు
- విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడొద్దు: నందకిషోర్



**ఆదిభట్ల అక్టోబర్ 3 మహా**: ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పరిధిలోని బొంగ్లూర్, ఆదిబట్ల పరిసర ప్రాంతాల్లో ఉన్న, దనిక్ భారత్ జూనియర్ కాలేజ్, లామెంటరీ జూనియర్ కాలేజ్ల నిర్వహణ, అనుమతులు విద్యార్థుల అడ్మిషన్లకు సంబంధించిన అంశాలపై శనివారం ఎన్ఎస్ యుఐ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షుడు నందకిషోర్ ఇంటర్ బోర్డు కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. కళాశాలలకు అవసరమైన అనుమతులు ఉన్నాయా? ఏ సంస్థకు సంబంధించిన అనుమతులతో విద్యా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు? అనే అంశాలపై అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని కోరినట్లు వెల్లడించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... విద్యార్థులను తప్పుదారి పట్టించే విధంగా అనుమతులు లేకుండా లేదా ఇతర కళాశాలల అనుమతులను ఉపయోగించి నిర్వహణ జరుగుతున్నట్లు విచారణలో తేలితే, సంబంధిత కళాశాలలపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అవసరమైన అనుమతులు వచ్చే వరకు కళాశాలల నిర్వహణను నిలిపివేయాలని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అధికారులు ఈ ఫిర్యాదుపై వెంటనే స్పందించి సమగ్ర విచారణ జరిపించాలని, విద్యా శాఖ అధికారిని కోరినట్లు నందకిషోర్ తెలిపారు...



## ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య అధికారులే వారధి.!

- సమస్యలు గుర్తించాలి... పరిష్కారానికి కృషిచేయాలి
- మధ్యవర్తులు లేకుండా ప్రభుత్వపథకాలు నేరుగా ప్రజలకు చేరాలి
- ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి
- మంచాల మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష



**మంచాల అక్టోబర్ 3 మహా**: ప్రభుత్వ పథకాలు మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా ప్రజలకు చేరినప్పుడే సర్కార్ లక్ష్యం నెరవేరుతుందని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య అధికారులు వారధిగా పనిచేయాలన్నారు. శనివారం మంచాల మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అభివృద్ధి కార్యక్రమాల పురోగతి, సంక్షేమ పథకాల అమలుతీరును సంబంధిత అధికారులను అడిగితెలుసుకున్నారు. అధికారులు హెడ్క్వార్టర్‌ను వదిలి, ప్రజల వద్దకు వెళ్తేనే సమస్యలు తెలుస్తాయన్నారు. ఆఫీస్‌కు వచ్చామా... వెళ్లిపోయామా అన్నట్టుగా విధుల నిర్వహణ ఉండకూడదని ఎమ్మెల్యే తెలిపారు.

**పంచాయతీ కార్యదర్శులే కీలకం**

గ్రామాల అభివృద్ధి, పేదరికం నిర్మూలనే లక్ష్యంగా ముందుకెళ్తున్న తరుణంలో క్షేత్రస్థాయిలో ఉండే పంచాయతీ కార్యదర్శులే కీలకమని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామంలో సమస్యను గుర్తించి, సంబంధితశాఖాధికారికి సమాచారమివ్వాలని చెప్పారు. ప్రతీరోజూ ఏయే అధికారి గ్రామంలో పర్యటిస్తున్నారనేది గ్రామపంచాయతీలో రికార్డు మెయిన్‌టెయిన్ చేయాలని సూచించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, వీధిదీపాలు, రోడ్ల పరిస్థితి, ప్రభుత్వ పథకాల అమలును నిత్యం పర్యవేక్షించాలన్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, జీపీవోలతో సమన్వయంతో గ్రామాల అభివృద్ధి సెక్రటరీలు ముందుండి పనిచేయాలన్నారు.

**మంచాల రూపురేఖలు మార్చుదాం**

వెనకబడిన ప్రాంతంగా పిలిచే ఈ మండలంలో అత్యున్నత ప్రమాణాలతో ఆరుట్ల టీపీఎస్ ఏర్పాటు చేసి, రాష్ట్రానికే దిక్సూచీగా నిలబెట్టామన్న మల్‌రెడ్డి... మంచాలకు మరో విద్యాకేంద్రం తెస్తామన్నారు. ఇప్పటి వరకు రోడ్లు, మౌలిక వసతుల కల్పనకు మండలానికి రూ.66కోట్ల నిధులిచ్చామని... ఒక్కో గ్రామానికి సుమారుగా మూడు కోట్లు అందినట్లు ఎమ్మెల్యే తెలిపారు. మంచాల మండల రూపురేఖలు మార్చేందుకు చేసే ప్రయత్నంలో అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. విద్యుత్ సరఫరా పట్ల ప్రత్యేకంగా ఆరాతీసిన ఎమ్మెల్యే.. కరెంటు సరఫరాలో ఎలాంటి అంతరాయాలు ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఏఎంసీ చైర్మన్ కంబాలపల్లి గురునాథరెడ్డి, మంచాల పిఏసిఎస్ చైర్మన్ వెదిరె హనుమంత్ రెడ్డి, పలు శాఖల అధికారులు, వివిధ గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు పలువురు పాల్గొన్నారు.

## జనగణనలో ఓబిసి కులగణన చేపట్టాలి.!

- ఓబీసీలకు అన్ని రంగాల్లో సామాజిక న్యాయం కల్పించాలి
- పీసీసీ రాష్ట్ర ఓబిసి కో ఆర్డినేటర్ వరికుప్పల సుధాకర్
- నేడు ఆదివారం శంషాబాద్‌లో ఓబీసీల బహిరంగ సభ
- ఓబీసీలు సభకు హాజరై విజయవంతం చేయాలి



**ఇబ్రహీంపట్నం అక్టోబర్ 3 మహా**: దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినప్పటికీ ఓబీసీలకు వారి జనాభా నిష్పత్తికి అనుగుణంగా తగిన న్యాయం జరగకపోవడం ఆందోళనకరం అని పీసీసీ రాష్ట్ర ఓబిసి కో ఆర్డినేటర్ వరికుప్పల సుధాకర్ అన్నారు. నేడు ఆదివారం శంషాబాద్‌లో జరగనున్న, ఓబీసీల బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వరికుప్పల సుధాకర్ మాట్లాడుతూ... దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు విద్య, ఉద్యోగ, వాణిజ్య, రాజకీయ చట్టసభల్లో సమాన సామాజిక అవకాశాలు కల్పించినప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. అభివృద్ధిలో వెనుకబడిన వర్గాలను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావాల్సిన సమయంలో, వారికి సమాన అవకాశాలు అందకపోవడం వల్ల వారు మరింత వెనుకబడుతున్న పరిస్థితి కొనసాగుతోంది. ఓబీసీల న్యాయపరమైన రాజ్యాంగబద్ధమైన హక్కుల సాధనలో భాగంగా, ప్రస్తుతం నిర్వహించనున్న జాతీయ జనగణనలో ఓబీసీల కులగణనను తప్పనిసరిగా చేపట్టాలని, పిసిసి రాష్ట్ర కోఆర్డినేటర్ డిమాండ్ చేశారు. ఓబీసీ ఆధ్వర్యంలో నేడు ఆదివారం శంషాబాద్ లో జరగనున్న బహిరంగ సభలో ఓబీసీలకు రావాల్సిన, అందాల్సిన అంశాలపై భవిష్యత్ కార్యాచరణను బహిరంగ సభలో ప్రకటించనున్నట్లు తెలియజేస్తు, ఈ యొక్క బహిరంగ సభకు హాజరై విజయవంతం చేయాలని ఆయన ఓబీసీలకు పిలుపునిచ్చారు.



## పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధే నా లక్ష్యం

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- రూ.2.60 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**హనుమకొండ, మహా** : వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన గడిచిన 33 నెలల్లో నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు.శనివారం 31వ డివిజన్ పరిధిలోని అవంతి స్కూల్ కాలనీ, హంటర్ రోడ్ విశాల్ మార్ట్ ఆవరణ, సూర్యోదయ కాలనీ, శ్రీరామ్ హిల్స్, హంటర్ హిల్స్ రోడ్ నంబర్ 3 ప్రాంతాల్లో సుమారు రూ.2.60 కోట్లతో చేపట్టనున్న అంతర్గత రోడ్లు, సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే నాయిని శంకుస్థాపన చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కాలనీ ప్రజలు, సంబంధిత అధికారులతో కలిసి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి ప్రతి డివిజన్ లో రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే చేపట్టిన అభివృద్ధి పనులతో పాటు అవసరమైన ప్రాంతాల్లో కొత్త పనులను కూడా వేగంగా చేపడుతున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే నాయిని తెలిపారు. అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో రాజీ లేకుండా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ మెంబర్ బత్తిని శ్రీనివాస్ రావు, డివిజన్ ఇంచార్జ్ మార్క విజయ్ కుమార్, మాజీ కార్పొరేటర్ మామిండ్ల రాజు, వేల్పుల మోహన్ రావు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.







## కెప్టెన్ స్మిత్ మచ్చార్ కు శ్రీ రాగా స్కూల్ అభినందనలు

**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: ప్రమాదకర పరిస్థితుల్లో అపారమైన ధైర్యసాహసాలు ప్రదర్శించి ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన భారతీయ పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చార్ సేవలను కొనియాడుతూ శ్రీ రాగా ప్లే అండ్ హై స్కూల్‌లో శనివారం ప్రత్యేక అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ రాగా స్కూల్ కరస్పాండెంట్ మల్లారపు వర ప్రసాద్ మాట్లాడుతూ ఆపద సమయంలో కెప్టెన్ స్మిత్ మచ్చార్ చూపిన ధైర్యం సమయస్ఫూర్తి కర్తవ్యనిబద్ధత విద్యార్థులకు స్ఫూర్తిదాయకమన్నారు. శ్రీ రాగా డైరెక్టర్ మల్లారపు కవిత మాట్లాడుతూ మానవ ప్రాణాలను కాపాడేందుకు స్మిత్ మచ్చార్ ప్రదర్శించిన సాహసం యువతకు ఆదర్శమని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాంబాబు, మహా లక్ష్మి, చరిత శ్రీ, స్వాతి, అఖిల రామ్ కృష్ణ విద్యార్థులు పాల్గొని కెప్టెన్ స్మిత్ మచ్చార్‌కు ఘనంగా అభినందనలు తెలిపారు.



## 25సంవత్సరాలుగా నలుగుతున్న రోడ్డు సమస్యను పరిష్కరించిన,ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్.

**రాజేంద్రనగర్ మహా** : శంషాబాద్ మండలం సుల్తాన్ పల్లి గ్రామపంచాయతీ కేబి దొడ్డి గ్రామం నుండి షాబాద్ రోడ్డు వరకు దాదాపు కిలోమీటర్ దూరం రోడ్డులో భూములు కోల్పోతున్న భూయజమాని తనకు న్యాయం చేయాలని కోరుతూ కోర్టును ఆశ్రయించడంతో సమస్య పరిష్కారం కాకుండా 25సంవత్సరాలుగా అలాగే ఉండడంతో ప్రయాణికులు వాహనదారులు, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం పై కేబి దొడ్డి గ్రామ వార్డు సభ్యులు సుమిత్ర మల్లికార్జున్ సర్పంచ్ ప్రభాకర్ గౌడ్ మాజీ సర్పంచ్ దండు ఇస్తారి పలుమార్లు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ డ్ దృష్టికి సమస్యను తీసుకుపోయారు. గత కొంతకాలం నుంచి కోర్టు కేసులు వేసిన వారితో మాట్లాడి పలుమార్లు చర్చలు జరిపి రోడ్డు సమస్యకు పరిష్కారం చూపారు. శనివారం కేబిదొడ్డి గ్రామం నుంచి షాబాద్ రోడ్డు కిలోమీటర్ పొడవున నిలిచిపోయిన బీటీ రోడ్డు పనులను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మహేందర్, నీరటిరాజుముదిరాజ్, నాయకులు చంద్రారెడ్డి, యాదగిరిరెడ్డి, సుల్తాన్ పల్లి సర్పంచ్, ప్రభాకర్ గౌడ్, మాజీ సర్పంచులు దండు ఇస్తారి , వై సిద్ధేశ్వర్, ఉప సర్పంచ్ దండు శివ, పార్టీ నాయకులు కాసుల బాలరాజు గౌడ్,సిద్ధిక్, బండ్లగూడం శివకుమార్, దండు మురళి, మంద శ్రీనివాస్, బైండ్ల నరసింహ, మంద యాదయ్య, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# సహకార సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కృషి

- 250 మెట్రిక్ టన్నుల గోడౌన్ ప్రారంభం
- రూ.30 లక్షలతో ఫుడ్ గ్రెయిన్ స్టోరేజ్ గోదాం కు శంకుస్థాపన పరకాల ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్

**వరంగల్, సంగెం, మహా** : వరంగల్ జిల్లా సంగెం మండలంలో సహకార సంఘాలు, మహిళా సంఘాలకు అవసరమైన మౌలిక వసతులను మరింత బలోపేతం చేసే దిశగా శనివారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా రామచంద్రపురం గ్రామంలో ఎఫ్ఎస్‌సీఎస్ కాపుల కనపర్తి సొసైటీ ఆధ్వర్యంలో నిర్మించిన 250 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోడౌన్ ను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ సొసైటీ పాలక మండలి సభ్యులు చక్కగా పనిచేస్తున్నారని అభినందించారు. సొసైటీ ద్వారా సభ్యులకు అందుబాటులో ఉన్న వివిధ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.సహకార సంఘాల ద్వారా సభ్యుల ఆర్థిక అభివృద్ధికి మరింతగా కృషి చేయాలని కోరారు. మహిళలకు ఉపాధి, అదనపు ఆదాయ అవకాశాలు కల్పించే ఉద్దేశంతో పాల ఉత్పత్తి, పాల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మహిళలు, సొసైటీ సభ్యులు ఈ సదుపాయాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలో సహకార రంగం అభివృద్ధికి, వివిధ కార్యక్రమాల అమలుకు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అందిస్తున్న సహకారం, ప్రోత్సాహాన్ని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా రైతులకు, సభ్యులకు అందుతున్న సేవలను మరింత విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నూతనంగా నిర్మించిన గోడౌన్ ను రైతులు, సొసైటీ సభ్యులు సద్వినియోగం చేసుకుని తమ వ్యవసాయ ఉత్పత్తులను భద్రపరుచుకోవాలని సూచించారు. సహకార సంఘాల బలోపేతానికి పాలక మండలి సభ్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కోరారు. అనంతరం సంగెం మండలం తీగరాజుపల్లి గ్రామంలో ఎస్సీ ఆర్పి, డిఆర్‌డిఏ, మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో వీబీజీ, రామ్జి గ్రాంట్ ద్వారా రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఫుడ్ గ్రెయిన్ స్టోరేజ్ గోదాం నిర్మాణానికి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా సహకార అధికారి నీరజ, జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ భాస్కర్, సంగెం తహసిల్దార్ రాజకుమార్, మండల అభివృద్ధి అధికారి రమేష్, అధికారులు, మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు, సొసైటీ పాలక మండలి సభ్యులు, సిబ్బంది, రైతులు, సొసైటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.





# పేదల సొంతింటి కలకు రూ.300 కోట్ల ఆసరా

- తాన్లా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 5 వేల ఇళ్ల నిర్మాణం
- దసరాకు భూమిపూజ.. అర్హులకు స్థలాల కేటాయింపుపై కసరత్తు
- బేతుపల్లి గంగారంలో గ్రామీణ ఆరోగ్య కేంద్రం, ప్రయోగశాలలను పరిశీలించిన మంత్రి పొంగులేటి

**సత్తుపల్లి, మహా** : సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాల్లోని నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు తాన్లా ఫౌండేషన్ ముందుకొచ్చింది. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఉదయ్‌కుమార్‌రెడ్డి తన సొంత నిధులతో సుమారు రూ.300 కోట్ల అంచనా వ్యయంతో 5,000 ఇళ్లను ఉచితంగా నిర్మించి ఇవ్వనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రానున్న దసరా సందర్భంగా ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సత్తుపల్లి మండలం బేతుపల్లి గంగారంలో తాన్లా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామీణ ఆరోగ్య కేంద్రం, ప్రయోగశాలలను శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీసు కమిషనర్ సునీల్‌దత్, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణతో కలిసి సందర్శించారు.

**అర్హులకు స్థలాల కేటాయింపు**

మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తరఫున పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తే, వాటిపై తాన్లా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు రూ.300 కోట్లతో 5,000 ఇళ్లు నిర్మించి ఇస్తామని ఉదయ్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు. ఈ మేరకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లు, సంబంధిత ఎమ్మెల్యేల సమన్వయంతో అర్హులైన నిరుపేదలను గుర్తించి స్థలాల కేటాయింపు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**పేదలకు ఉచిత వైద్య సేవలు**

సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో నారాయణపురంలో పేదలకు ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణం జరుగుతోందని మంత్రి తెలిపారు. పేదలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆసుపత్రులు, స్వచ్ఛంద సంస్థలు, ఫౌండేషన్లకు ప్రభుత్వం తరఫున అవసరమైన సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఐదు నెలల్లో రూ.9 కోట్ల మేర మందులు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ.. సంపాదించిన సొమ్మును సమాజ శ్రేయస్సుకు వినియోగించడం అభినందనీయమన్నారు. బీపీ, మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి నెలకు రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు మందుల ఖర్చు భారంగా మారుతోందని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో కేవలం ఐదు నెలల్లోనే దాదాపు రూ.9 కోట్ల విలువైన మందులను పేదలకు ఉచితంగా లేదా సహాయంగా అందించడం విశేషమన్నారు.

**పది నిమిషాల్లోనే పరీక్షల ఫలితాలు**

ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ.. గంగారంలో అత్యాధునిక వైద్య సేవలు, వైద్య పరికరాలు అందుబాటులోకి రావడం అభినందనీయమన్నారు. ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా నిపుణులైన వైద్యులు, వైద్య సిబ్బంది సేవలు అందుతున్నాయని తెలిపారు. అత్యాధునిక సాంకేతికతతో కొన్ని వైద్య పరీక్షల ఫలితాలు కేవలం పది నిమిషాల్లోనే అందుతున్నాయని పేర్కొన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే నిరుపేదలకు ఉచిత వైద్యం, మందుల ద్వారా నెలకు రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు ఆర్థిక భారం తగ్గుతోందని తెలిపారు. సేవా దృక్పథంతో ముందుకొచ్చిన ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఆయన సోదరుడు మహీల్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో ఐటీడీఏ భద్రాచలం పీవో బి.రాహుల్, కల్లూరు సబ్‌కలెక్టర్ అజయ్‌యాదవ్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లిలో మూడు రోజులు విద్యుత్ అంతరాయం

**పెద్దపల్లి మహా** : పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ నూతన 33/11 కేవీ సబ్‌స్టేషన్, కూనారం రైల్వే గేట్ సమీపంలో విద్యుత్ పనుల కారణంగా అక్టోబర్ 3, 4, 5 తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్ సెక్షన్ అదనపు సహాయ ఇంజనీర్ సీహెచ్. శ్రీనివాస్ తెలిపారు. శ్రీనివాస టాకీస్, హెరిటేజ్, టీచర్స్ కాలనీ, కూనారం రోడ్, వ్యవసాయ మార్కెట్, గణేష్ నగర్, ముకుంద రెడ్డి అపార్ట్మెంట్, బొంకూరి కాలనీ తదితర ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.



# పెండింగ్ దరఖాస్తుల సత్వర పరిష్కారానికి చర్యలు

**మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు**

**మంచిర్యాల, మహా** : పెండింగ్ దరఖాస్తుల సత్వర పరిష్కారానికి అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి మోతీరామ్, మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్ రావులతో కలిసి అన్ని మండలాల తహసీల్దార్లు, ఉప తహసీల్దార్లు, మండల సర్వేయర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రజావాణి ద్వారా వచ్చిన పెండింగ్ దరఖాస్తులను మండల, ఆర్డీవో, మున్సిపల్ స్థాయిల్లో పరిశీలించి జిల్లా స్థాయిలో వేగంగా పూర్తిచేయాలని ఆదేశించారు. జిల్లాలోని 81 గ్రామాల్లో జరుగుతున్న రీసర్వే ప్రక్రియను ఎస్.ఓ.పి ప్రకారం కొనసాగించాలని వివరించారు. రోవర్, గ్రౌండ్ కంట్రోల్ పాయింట్ల ఆధారంగా శాస్త్రీయంగా సర్వే చేయాలి. ఫారం9, ఫారం10 నోటీసులు, సరిహద్దుల నిర్ధారణ నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని వెల్లడించారు పెండింగ్ లో ఉన్న భూ భారతి దరఖాస్తులను నియోజకవర్గాల వారీగా గుర్తించి కారణాలతో నివేదిక సిద్ధం చేయాలని ఆయన అన్నారు. సాదా బైనామా దరఖాస్తుల్లో ఆమోదించినవి, తిరస్కరించినవి, కారణాలతో సమగ్ర నివేదిక ఇవ్వాలని వివరించారు. 22 ఏ కు సంబంధించిన కేసులను 2025కు ముందు, తర్వాతగా విభజించి నివేదిక రూపొందించాలని స్పష్టం చేశారు. రెవెన్యూ, అటవీ శాఖల మధ్య భూ సరిహద్దు వివాదాలను మండలాల వారీగా గుర్తించి పరిష్కరించాలని తెలిపారు. మీ సేవా పోర్టల్ లో భూ సంబంధిత డాక్యుమెంట్ల అప్ డేషన్ సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# ఉద్యమకారులకు అండగా నిలుస్తున్న ప్రజా ప్రభుత్వం

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- లింగాల కేదారి కుటుంబానికి ఆర్థిక భరోసా
- రూ.10 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేసిన ఎమ్మెల్యేలు, డిసిసి అధ్యక్షుడు

**హనుమకొండ, మహా** : ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన లింగాల కేదారి, పుష్పలత దంపతుల కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరు చేసిన రూ.10 లక్షల చెక్కును శనివారం అందజేశారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి , వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి కేదారి కుటుంబ సభ్యుల ఇంటికి వెళ్లి చెక్కును అందజేసి, కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆనాటి ఉద్యమకారులకు ఆపన్నహస్తం అందిస్తూ అండగా నిలిచిన లింగాల కేదారి సేవలను తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం గుర్తించి, ఆయన కుటుంబానికి ఆర్థిక చేయూత అందించిందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమ సమయంలో పోరాడిన ఉద్యమకారులను ప్రజా ప్రభుత్వం గౌరవిస్తుందని, రానున్న రోజుల్లోనూ ఉద్యమంలో పాల్గొని పోరాటం చేసిన ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తుందని అన్నారు. కేదారి కుటుంబం ప్రస్తుత కష్టకాలంలో తాను వ్యక్తిగతంగా కూడా అండగా నిలిచానని, తన వంతుగా కుటుంబ సభ్యులను అన్ని విధాలుగా ఆదుకుంటానని ఎమ్మెల్యే నాయిని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి, ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకోవడానికి కట్టుబడి ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# సకాలంలో సరుకుల పంపిణీ చేయాలి

**మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు**

**మంచిర్యాల, మహా** : జిల్లాలోని ఎంఎల్ఎస్ పాయింట్ల ద్వారా సరుకుల పంపిణీ, నిల్వలు, రికార్డుల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయాల భవన సముదాయంలోని తన ఛాంబర్ లో పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ, డిప్యూటీ తహసీల్దార్లతో కలిసి ఎంఎల్ఎస్ పాయింట్ల ఇన్‌చార్జిలు, డిప్యూటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో సరుకుల పంపిణీ, నిల్వలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎల్ఎస్ పాయింట్లకు అవసరమైన మేరకు సరుకులను సకాలంలో లిఫ్ట్ చేసుకోవాలని, లబ్ధిదారులకు నిర్ణీత సమయంలో పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. స్టాక్ కు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించి ఎప్పటికప్పుడు నవీకరించాలని, ప్రతి నెల స్టాక్ వివరాలను పరిశీలించి పూర్తి స్థాయిలో రీకన్సిలియేషన్ నిర్వహించాలని సూచించారు. సరుకుల నిల్వలు, పంపిణీ, లిఫ్టింగ్ లో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఈ సమావేశంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన రాష్ట్ర టిపిసిసి ప్రచార కమిటీ కన్వీనర్

**బెల్లంపల్లి , మహా** : బెల్లంపల్లి మండలంలోని బట్వాన్పల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మాజీ మండలాధ్యక్షులు సింగతి సత్యనారాయణ తండ్రి కీ:శే: సింగతి మల్లయ్య అనారోగ్యంతో మరణించడంతో రాష్ట్ర టి పి సి సి ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి శనివారం నాడు ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.కార్యక్రమంలో సీనియర్ నాయకులు భాకం కొమురయ్య, వార్డ్ మెంబర్ బొలిశెట్టి సుధాకర్, రంటెంకి హరి కృష్ణ , బాకం అంజయ్య, సింగతి అర్జయ్య , అచ్చ సత్తయ్య, చింతం స్వామి, వార్డు మెంబర్ చిలుముల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి

**బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్**

**బెల్లంపల్లి, మహా**: ప్రజా సేవలో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వినోద్ పీఏ గడ్డం దుర్గాప్రసాద్ జన్మదినం సందర్భంగా సూచించారు . అనంతరం ఆయన మాట్లాడుతూ గడ్డం ప్రసాద్ కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.గత 20 ఏళ్లుగా తనతో కలిసి ప్రజా సేవలో అంకితభావంతో పనిచేస్తున్నాడనీ, రానున్న రోజుల్లో కూడా ప్రజా సేవలో మరింత ఉత్సాహంతో, నిబద్ధతతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.పి ఎ గడ్డం దుర్గాప్రసాద్‌కు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, సంపూర్ణ ఆరోగ్యం కలగాలని, ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా, సంతోషంగా జీవించాలని ఎమ్మెల్యే ఆకాంక్షిస్తూ ఆశీస్సులు అందజేశారు.

# నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

వరంగల్, కలెక్టరేట్ మహా : వరంగల్ జిల్లాలో ప్రైవేట్ క్లినిక్స్, ఆస్పత్రులు క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. రిజిస్ట్రేషన్ లేకుండా నిర్వహించే ఆసుపత్రులు, క్లినిక్స్, డయాగ్నస్టిక్ కేంద్రాల పై నోటీసులు జారీ చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లో శనివారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్ జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ రిజిస్ట్రేషన్లు, రెన్యువల్స్, నిబంధనల అమలు పై డీఎంహెచ్ఓ డాక్టర్ బి. రాజా రెడ్డి నివేదిక సమర్పించారు. కొత్త రిజిస్ట్రేషన్, రెన్యువల్ కోసం వచ్చిన దరఖాస్తులను కమిటీ పరిశీలించింది. నిబంధనలు పాటిస్తున్న సంస్థలకు అనుమతులు మంజూరు చేయగా, ఫైర్ సేఫ్టీ తదితర అంశాల్లో లోపాలు ఉన్న సంస్థలకు వాటిని సరిచేసుకునేందుకు అవకాశం కల్పించాలని నిర్ణయించారు. ఆసుపత్రులు, క్లినిక్స్ లో వైద్యులు, సిబ్బంది, రిజిస్ట్రేషన్ వివరాలు, అందించే వైద్య సేవలు, ఫీజుల వివరాలను రోగులకు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని అధికారులు సూచించారు. బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, రికార్డుల నిర్వహణ, ఫైర్ సేఫ్టీ తదితర నిబంధనలను కూడా తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ వై.వి. గణేష్, డీసీపీ కవిత, డీఎంహెచ్ఓ డాక్టర్ బి. రాజా రెడ్డి, ఐఎంఏ ప్రతినిధి డాక్టర్ వెంకటస్వామి, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రాజమౌళి, ఫైర్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

**హనుమకొండ, మహా** ; కుడా పరిధిలోని వివిధ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్ పర్సన్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించినారు.శనివారం కుడా కార్యాలయంలో గుండు సుధారాణి తన ఛాంబర్ లో ఇంజనీరింగ్, హార్టికల్చర్ అధికారులతో అభివృద్ధి పనుల పై సమీక్ష నిర్వహించినారు. ఈ సందర్భంగా గుండు సుధారాణి మాట్లాడుతూ వరంగల్ లో అత్యంత ప్రాముఖ్యత కలిగిన శ్రీ భద్రకాళి దేవాలయం మాడ వీధులు, ఇన్నర్ రింగ్ రోడ్డు పనులు, వరంగల్ బస్ స్టేషన్ తో పాటు గ్రీనరీ పనులను ముమ్మరం చేయాలని అన్నారు. ఈ సమీక్ష సమావేశంలో కుడా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ అజిత్ రెడ్డి, హార్టికల్చర్ ఆఫీసర్ ఆసిఫ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మీర్జా అస్రఫ్, డిఈ శ్రీకాంత్, ఏఈ భరత్ లు పాల్గొన్నారు.

# న్యాయపోరాటంతో రైతుల ఘన విజయం

- రైతుల గోస పట్టని ఎమ్మెల్యే వినోద్ రాజీనామా చేయాలి
- బుయ్యారం గ్రామంలో నాగలితో దున్నిన బిజెపి రాష్ట్ర నేత కొయ్యల ఏమాజి



**బెల్లంపల్లి,మహా** :తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఆదేశాలతో బుయ్యారం గ్రామ రైతుల కళ్లల్లో ఆనందం వెల్లివిరిసింది. వేమనపల్లి మండలం బుయ్యారం గ్రామ రైతులు బిజెపి పార్టీకి చెందిన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజీ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేసి, చివరికి న్యాయపోరాటంతో రైతులకు విజయం వరించింది. శనివారం నాడు బుయ్యారం గ్రామంలో సంబంధిత రైతుల భూములను దుక్కి దున్ని బాజా భజంత్రీలతో ర్యాలీ నిర్వహించి సంబరాలు జరిపారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జడ్పీటీసీ ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కొయ్యల ఏమాజి ఆధ్వర్యంలో వేమనపల్లి మండలం బుయ్యారం గ్రామంలో రైతుల భూముల్లో దుక్కి దున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ న్యాయపోరాటంతో రైతులు విజయం దక్కిందన్నారు.పేద రైతులకు భూములు దక్కేలా చేసిన రాష్ట్ర హైకోర్టుకు ధన్యవాదాలు ప్రకటించారు. అనేక ఏళ్లుగా రైతులు సాగు చేసుకుంటున్న భూముల్లో అటవీశాఖ అధికారులు జోక్యం చేసుకొని వారిని వేధిస్తూ, అక్రమ కేసులు నమోదు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తూ ఉంటే స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ దున్నపోతు మీద వర్షం పడ్డా చందంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే వినోద్ రైతుల సమస్యల గురించి పట్టించుకోవడం లేదని, ఆయన చీరాల బీచ్లో జల్సాలు చేస్తున్నారా అని విమర్శించారు. ప్రజల సమస్యలు పట్టించుకోనీ ఎమ్మెల్యే గడ్డం వినోద్ తన పదవికి రాజీనామా చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అటవీశాఖ అధికారులు రైతుల భూములు కబ్జా చేస్తే ప్రతిదాడులు చేయడానికి కూడా వెనుకాడరని కొయ్యల ఏమాజి హెచ్చరించారు. గత యాభై ఏళ్లుగా అనేక మంది రైతులు సాగు చేస్తున్న భూములను అటవీ శాఖ అధికారులు అక్రమంగా ఆక్రమించుకొని వారికి ఉపాధి లేకుండా చేస్తున్నారని అన్నారు. వారికి ప్రభుత్వం పట్టాలు కూడా మంజూరు చేసిందని తెలిపారు. అప్పటి నుండి రైతులు సాగు చేస్తున్నారని అన్నారు. కానీ అటవీశాఖ అధికారులు ఇటీవల జోక్యం చేసుకొని రైతుల పై తప్పుడు కేసులు నమోదు చేసి జైలుకు పంపి వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిని చేలల్లో వెళ్లకుండా సాగు చేయకుండా అడ్డుకుంటున్నారని అన్నారు. దీనివల్ల పేద రైతులు కష్టాలు పడుతున్నారన్నారు. వారికి అన్ని హక్కులున్నా అటవీశాఖ అధికారులు అడ్డుకోవడం శోచనీయం అన్నారు. అటవీశాఖ అధికారులు రైతుల జోలికి పోవద్దని హెచ్చరించారు. అటవీశాఖ కార్యాలయాని బాధిత రైతులతో కలిసి ముట్టడిస్తామని హెచ్చరించారు.రాష్ట్ర ప్రభుత్వం పేద రైతుల భూములు టార్గెట్ చేసుకొని వ్యాపారం చేస్తున్నదని అన్నారు. 22A పేరుతో లక్షల ఎకరాల భూములు నిషేధిత జాబితాలో ఉన్నాయని తెలిపారు. పేదల భూములను అటవీ శాఖ అధికారులు బలవంతంగా కబ్జాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఎమ్మెల్యే వినోద్ రైతుల సమస్యలు పట్టించుకోవాలని , లేని పక్షంలో పేదల ఉసురు తగులుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు పులగం తిరుపతి,కేశవ్ రెడ్డి,మహిళా మోర్చ మండల అధ్యక్షులు ముడిమడుగుల లావణ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు శనిగారపు శ్రావణ్, కల్లేపల్లి నవీన్, ఎస్సీ మోరచ్చ జిల్లా నాయకులు నర్సింగ్, శ్రీనివాస్, రాజ కుమార్, ప్రశాంత్, అవినాష్,నాయకులు ముల్కల సత్యనారాయణ, జుమిడీ వెంకటేష్, ముడిమడుగుల శంకర్, పోషం, గోగర్ల లక్ష్మి తో పాటు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



## సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి..

- రిజిస్ట్రేషన్, రుణం, సబ్సిడీపై అవగాహన..
- ఏ డి ఈ ఉమామహేశ్వరరావు

**మణుగూరు, మహా** : ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన-సేవా సేతు అభియాన్ కార్యక్రమంలో భాగంగా మణుగూరు సబ్ స్టేషన్ ప్రాంగణంలో వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగిన ఈ కార్యక్రమంలో సౌర విద్యుత్ పథకం అమలు, నమోదు ప్రక్రియ, బ్యాంకు రుణాలు, ప్రభుత్వం అందించే సబ్సిడీ తదితర అంశాలపై అధికారులు వివరించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ ఉమా మహేశ్వర్‌రావు మాట్లాడుతూ ప్రధాన మంత్రి సూర్య ఘర్ పథకాన్ని అర్హులైన విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంటిపై సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ వినియోగ వ్యయాన్ని తగ్గించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. పథకంలో నమోదు చేసుకునే విధానం, సోలార్ వ్యవస్థ ఏర్పాటు ప్రక్రియ, బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం, సబ్సిడీ పొందే విధానంపై వినియోగదారులకు వివరించారు. ఈ సందర్భంగా వినియోగదారులు అడిగిన పలు సందేహాలను అధికారులు, సోలార్ కంపెనీల ప్రతినిధులు నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఏఈ జ్యోతి, ఏఏవో జ్యోతి, నాలుగు మండలాలకు చెందిన ఏఈలు, సబ్ ఇంజినీర్లు, బ్యాంకు అధికారులు, సోలార్ కంపెనీల ప్రతినిధులు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు దొబ్బల వెంకటప్పయ్య, విద్యుత్ శాఖ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం..

- - తుర్రంవారిగూడెంలో నూతన గృహప్రవేశాల్లో ఎమ్మెల్యే పాయం..
- లబ్ధిదారులకు పాయం శుభాకాంక్షలు



**మణుగూరు/అశ్వాపురం, మహా** : ఇందిరమ్మ ఇళ్ల పథకంతో పేద కుటుంబాల సొంతింటి కల నెరవేరుతోందని పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. అశ్వాపురం మండలం తుర్రంవారిగూడెం గ్రామంలో ఇందిరమ్మ పథకం కింద నూతనంగా ఇళ్లు నిర్మించుకున్న బానోతు అచ్చమ్మ, బానోతు శైలజ కుటుంబాల గృహ ప్రవేశ కార్యక్రమాల్లో శనివారం ఆయన పాల్గొన్నారు. నూతన గృహాల్లోకి ప్రవేశించిన లబ్ధిదారులను అభినందించిన ఎమ్మెల్యే వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కొత్త ఇళ్లలో సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సొంతిల్లు ప్రతి పేద కుటుంబానికి భద్రతతో పాటు ఆత్మగౌరవాన్ని కల్పిస్తుందని పేర్కొన్నారు. అర్హులైన పేదలకు గృహ వసతి కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో గృహ నిర్మాణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పినపాక నియోజకవర్గంలో ప్రజలకు అవసరమైన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఓరుగంటి రమేష్‌బాబు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## సిడిపిఓ ఆధ్వర్యంలో సామూహిక శ్రీమంతాలు

**జూలూరుపాడు, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు మండల పరిధిలోని కొమ్ముగూడెం సెక్టార్ అంగన్వాడి కేంద్రంలో సిడిపిఓ జ్యోతి ఆధ్వర్యంలో తొమ్మిదవ పోషణ మాసం సందర్భంగా గర్భిణీ స్త్రీలకు సామూహిక శ్రీమంతం కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. గర్భిణీ స్త్రీలు బలవర్ధకమైన పౌష్టిక ఆహారం తీసుకోవడం ద్వారా తల్లి, శిశువు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనిచ్చి తల్లి, బిడ్డలు సుఖసంతోషాలతో ఉండాలని గర్భిణీ స్త్రీలను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ దీప తోపాటు సెక్టార్ పరిధిలోని అంగన్వాడి టీచర్స్, గ్రామ కార్యదర్శి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## రగ్బీ లీగ్ లో ప్రతిభ చూపిన మైనార్టీ గురుకుల విద్యార్థులు

**కారేపల్లి, మహా** : అస్మిత సిటీ రగ్బీ లీగ్ పోటీలలో కారేపల్లి మైనార్టి గురుకుల విద్యారులు ప్రతిభ చూపారు. 29వ తేదిన ఖమ్మంలో సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన రగ్బీ అండర్15 విభాగంలో రన్నర్‌అప్‌గా నిలవగా, అండర్ 18 విభాగంలో 3వ స్థానంలో నిలిచి పతకాలు సాధించారు. ఈ సందర్భంగా శనివారం విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ డీ. సావిత్రి అభినందించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మైనార్టీ గురుకుల విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలలో ప్రత్యేక తర్ఫీదు ఇవ్వటంతో వారి రాణిస్తున్నారన్నారు.ఈ సందర్బంగా విద్యార్థులకు శిక్షణ అందించి వారి ప్రతిభను వెలికితీసిన పీఈటీ, పీడీ లను అభినందించారు.



## సింగరేణి ప్రభావిత గ్రామాల సమస్యలు పరిష్కరించాలి

- పనిచేయని ఆర్వో ప్లాంట్లకు మరమ్మతులు.. కమ్యూనిటీ హాళ్లను అందుబాటులోకి తేవాలి

**సత్తుపల్లి, అక్టోబరు 3**:మహా : సింగరేణి ప్రభావిత గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలపై ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం తక్షణమే దృష్టి సారించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి జాజిరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తాగునీటి కోసం ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు పనిచేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వాటిని వెంటనే మరమ్మతులు చేయించి శుద్ధి చేసిన తాగునీరు నిరంతరం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. శనివారం పిల్లి నాగమణి అధ్యక్షతన జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం సత్తుపల్లి మండల కమిటీ సమావేశంలో జాజిరి శ్రీనివాస్ మాట్లాడారు. సింగరేణి నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాళ్లను ప్రజల అవసరాలకు పూర్తిస్థాయిలో వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పలు గ్రామాల్లో నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయి కమ్యూనిటీ హాళ్లు నిరుపయోగంగా మారాయని తెలిపారు. మిగిలిన పనులకు నిధులు కేటాయించి త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. ప్రభావిత గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్యం, వీధి దీపాలు వంటి మౌలిక వసతులపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కోరారు. అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, రేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కువ్వారపు లక్ష్మణరావు, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు కొలికిపోగు సర్వేశ్వరరావు, అయినంపూడి సనందరావు, బండి వేలాద్రి, తడికమళ్ల రామకృష్ణ, బెజవాడ లక్ష్మీనారాయణ, మల్లాది వెంకట్, ఎలగం రాములు, సప్పిడి భాస్కర్, పరమేష్, సరోజినీ, తోటకూర వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



## బీసీ బీఆర్ఎస్ నేతలపై దాడి పై పోలీసులకు ఫిర్యాదు!

- ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా హింసకు పాల్పడ్డారని బిఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష ఆరోపణ!

**పెద్దపల్లి మహా** : రాజకీయ పదవుల కోసం బీసీ బీఆర్ఎస్ నేతలపై దాడికి పాల్పడ్డారని టీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష ఆరోపించారు. పెద్దపల్లి బీఆర్ఎస్ బీసీ నేతలను కార్యక్రమానికి ఎందుకు ఆహ్వానించలేదని ప్రశ్నించినందుకు సమాధానం చెప్పకుండా హింసకు పాల్పడ్డారని ఆమె పేర్కొన్నారు. బీసీ నేతలకు తమకు జరిగిన అన్యాయంపై ప్రశ్నించే హక్కు ఉందని, అయితే ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా దాడులకు పాల్పడటం సరికాదని దాసరి ఉష అన్నారు. సొంత పార్టీకి చెందిన బీసీ నేతలతోనే ఇలాంటి వ్యవహారం చేయడం బాధాకరమని పేర్కొన్నారు. దాసరి మనోహర్‌రెడ్డి అనుచరులుగా పేర్కొంటున్న కొందరు వ్యక్తులు మద్యం మత్తులో దాడికి పాల్పడ్డారని, ఆస్తులను ధ్వంసం చేశారని ఆమె ఆరోపించారు. ఈ ఘటనకు సంబంధించి దాసరి మనోహర్‌రెడ్డి, ఆయన అనుచరులపై పోలీసులకు అధికారికంగా ఫిర్యాదు చేసినట్లు దాసరి ఉష తెలిపారు. ఘటనపై పోలీసులు సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ఆమె కోరారు. "ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలి.. హింసకు పాల్పడకూడదు. బీసీ నేతలకు గౌరవం ఇవ్వాలి.. బెదిరింపులకు పాల్పడకూడదు" అని దాసరి ఉష అన్నారు.



## అంగన్ వాడీలు బహుళార్థక సేవా కేంద్రాలు

- భాగ్యనగర్ తండాలో పోషణ మాసోత్సవాలు

**కారేపల్లి,మహా**:అంగన్ వాడీ కేంద్రాలు బహుళార్ధక కేంద్రాలుగా సేవలందిస్తున్నాయని ఐసీడీఎస్ కామేపల్లి ప్రాజెక్ట్ సీడీపీవో కే.ఉమ అన్నారు. జాతీయపోషణ మాసోత్సవాల సందర్భంగా శనివారం కారేపల్లి మండలం భాగ్యనగర్ తండాలో అవగాహన కార్యక్రమాన్నినిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో ఉమ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో పౌష్టికాహారం అందించటంతో పాటు చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య అందిస్తూ ఆరోగ్యకర సమాజానికి పునాదులు వేస్తుందన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. చిరుధాన్యాలు, ఆకుకూరలు, పప్పుధాన్యాలు, కూరగాయలు, పండ్లను నిత్య అహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సత్యశీల, వార్డు సభ్యులు వాంకుడోత్ గాంధీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి!

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

**పెద్దపల్లి మహా** : జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శనివారం అప్పన్నపేటలో బైపాస్ రోడ్డు, రాఘవపూర్‌లో ఇందిరా మహిళా శక్తి భవనం, పెద్దపల్లి బస్ డిపో, కూనారం రైల్వే ఫ్లైఓవర్ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అప్పన్నపేటలో బైపాస్ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు భూములు కోల్పోతున్న రైతులకు నిబంధనల ప్రకారం పరిహారం అందించాలని సూచించారు. రాఘవపూర్‌లో పూర్తయిన ఇందిరా మహిళా శక్తి భవనాన్ని ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని, అప్రోచ్ రోడ్డుకు అవసరమైన మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. పెద్దపల్లి బస్ డిపోలో పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేసి ప్రయాణికులు, సిబ్బందికి అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. కూనారం రైల్వే ఫ్లైఓవర్ పనులను వేగవంతం చేసి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని, విద్యుత్ వైరింగ్, స్తంభాల మార్పిడి పనులను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. అభివృద్ధి పనులను అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ, శాఖల మధ్య సమన్వయంతో పనులు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో ఆర్డీఓ బి. గంగయ్య, ఆర్అండ్‌బీ, పీఆర్, రైల్వే, ఆర్టీసీ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి కోటీశ్వరులను చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం!

- ప్రభుత్వ విప్ విజయ రమణారావు

**పెద్దపల్లి మహా** : సుల్తానాబాద్; మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి స్వావలంబన దిశగా తీసుకెళ్లడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. సుల్తానాబాద్ మండలం భూపతిపూర్ గ్రామంలో స్వశక్తి సంఘాల మహిళల ఆధ్వర్యంలో సుమారు రూ.1.15 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన చైతన్య జ్యోతి పెట్రోల్ పంపును శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి ప్రభుత్వ విప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయ రమణారావు మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. మహిళల ఆధ్వర్యంలో సోలార్ పవర్ ప్లాంట్లు, ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ పంపులు ఏర్పాటు చేయడంతో పాటు చిన్న దుకాణాలు, టిఫిన్ సెంటర్లు, స్కూల్ యూనిఫామ్‌ల కుట్టు కేంద్రాలు తదితర రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు.

**మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత :కలెక్టర్ కోయ శ్రీహర్ష**

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. స్వశక్తి సంఘాల మహిళలకు రూ.10 లక్షల వరకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించామని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు ఆరుగురు సభ్యులు ప్రమాదాల్లో మృతి చెందగా, వారి కుటుంబాలకు రూ.60 లక్షల బీమా పరిహారం అందించినట్లు పేర్కొన్నారు. సహజ మరణం సంభవించిన మహిళలకు రూ.2 లక్షల రుణ బీమా సౌకర్యం కూడా అందుబాటులో ఉందన్నారు. మహిళలకు విహబ్, పెట్రోల్ పంపులు తదితర ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. మంథనిలో టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, గత మూడు సంవత్సరాలుగా వడ్డీలేని రుణాల విధానాన్ని తిరిగి అమలు చేస్తున్నామని చెప్పారు.

స్వశక్తి సంఘాల మహిళలకు సుమారు రూ.33 కోట్ల మేర వడ్డీ రాయితీ ప్రయోజనం అందించామని కలెక్టర్ తెలిపారు. వడ్డీలేని రుణాల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు వెల్లడించారు.

**పెద్దపల్లి నియోజకవర్గంలో రూ.33.42 కోట్ల రుణాలు**

పెద్దపల్లి నియోజకవర్గంలో 15,715 స్వశక్తి సంఘాలకు రూ.33.42 కోట్ల రుణాలు అందించినట్లు అధికారులు తెలిపారు. మహిళల ఆర్థికాభివృద్ధికి ఆర్టీసీ బస్సులు, సోలార్ ప్లాంట్లు, పెట్రోల్ పంపులు, చిరు వ్యాపారాల ద్వారా మరిన్ని అవకాశాలను అందుబాటులోకి తీసుకురావాలని ఈ సందర్భంగా సూచించారు. అలాగే యాసంగి సీజన్‌లో వరి సాగుకు బదులుగా రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లైబ్రరీ చైర్మన్ అన్నయ్య గౌడ్, డీఆర్‌డీఓ కలిందిని, అడిషనల్ డీఆర్‌డీఓ రవీందర్, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, స్వశక్తి సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతా నిబంధనలను కఠినంగా అమలు చేయాలి!

**సీపీ అంబర్ కిషోర్ ఝా**

పెద్దపల్లి మహా : రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు ప్రజలకు సురక్షిత ప్రయాణం కల్పించడమే లక్ష్యంగా రోడ్డు భద్రతా నిబంధనలను కఠినంగా అమలు చేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులను ఆదేశించారు. శనివారం కమిషనరేట్ కార్యాలయంలో ట్రాఫిక్ పోలీసులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. రహదారులపై భారీ వాహనాలను ఇష్టారాజ్యంగా నిలిపివేయకుండా చర్యలు చేపట్టాలని, అవసరమైన ప్రాంతాల్లో ముందస్తు హెచ్చరికలు, కాషన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రమాదాలకు ప్రధాన కారణంగా మారుతున్న రాంగ్ సైడ్ డ్రైవింగ్‌ను నియంత్రించేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**విద్యార్థుల భద్రతపై ప్రత్యేక దృష్టి!**

ప్రజలతో పాటు ముఖ్యంగా విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని సీపీ స్పష్టం చేశారు. ఆటోలు, స్కూల్ వ్యాన్లు, బస్సుల్లో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించకుండా క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. స్కూల్ వాహనాల ఫిట్‌నెస్, డ్రైవర్ల డ్రైవింగ్ లైసెన్సులు, స్పీడ్ గవర్నర్లు, భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. విద్యార్థులను తరలించే వాహనాల విషయంలో నిబంధనలను ఉల్లంఘిస్తే కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు.

**హెల్మెట్, సీట్‌బెల్ట్‌పై ప్రత్యేక నిఘా!**

హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపడం, సీట్ బెల్ట్ ధరించకపోవడం, నంబర్ ప్లేట్ లేని వాహనాల వినియోగం, మైనర్ల డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, సిగ్నల్



జంపింగ్ తదితర ట్రాఫిక్ ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీ ఆదేశించారు. అదేవిధంగా తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి, అక్కడ అవసరమైన రోడ్డు భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రమాదాలకు దారితీసే పరిస్థితులను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు.

**నిరంతర అవగాహన కార్యక్రమాలు!**

చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణనష్టానికి దారితీసే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ నిబంధనల అమలుతో పాటు ప్రజల్లో అవగాహన పెంచాలని అంబర్ కిషోర్ ఝా సూచించారు. వాహనదారులు, డ్రైవర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులకు నిరంతరం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రమాదాల నివారణలో సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని, రోడ్డు భద్రతా నిబంధనలను క్షేత్రస్థాయిలో కఠినంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరరావు, పెద్దపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, మంచిర్యాల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ హనన్, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ అనిల్, ట్రాఫిక్ ఎస్ఐలు పాల్గొన్నారు.

# పర్పుల్ చీరలో మిర్నా మెరుపులు

హైదరాబాద్, మహా: దక్షిణాది నటి మిర్నా మరోసారి తన సంప్రదాయ అందంతో అభిమానులను ఆకట్టుకున్నారు. తాజాగా ఆమె సోషల్ మీడియాలో పంచుకున్న ఫొటోల్లో పర్పుల్ రంగు చీరలో ఎంతో అందంగా కనిపించారు. బంగారు రంగు ఎంబ్రాయిడరీతో కూడిన చీరకు భారీగా అలంకరించిన బ్లౌజ్‌ను జత చేసి సంప్రదాయ, రాజసమైన లుక్‌లో దర్శనమిచ్చారు. సహజమైన బ్యాక్‌డ్రాప్‌లో తీసిన ఈ ఫొటోల్లో మిర్నా సింపుల్ పోజులతో ఆకట్టుకున్నారు. సంప్రదాయ వస్త్రధారణలోనూ తనదైన స్టైల్‌ను చూపిస్తూ ఫ్యాషన్ ప్రియుల దృష్టిని ఆకర్షించారు. ఫొటోషూట్‌కు సంబంధించిన సరదా వ్యాఖ్యను కూడా ఆమె పంచుకోవడంతో ఈ చిత్రాలకు మరింత ప్రత్యేకత ఏర్పడింది. మిర్నా అసలు పేరు సయానా సంతోష్. కెరీర్ ప్రారంభంలో అదితి మీనన్ పేరుతోనూ ఆమె నటించారు. 2016లో వచ్చిన 'పట్టథారి' చిత్రంతో తమిళ సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టారు. అనంతరం మలయాళం, తెలుగు చిత్రాల్లోనూ నటించి గుర్తింపు తెచ్చుకున్నారు. 'బిగ్ బ్రదర్', 'క్రేజీ ఫెలో', 'ఉగ్రం' వంటి సినిమాల్లో నటించిన ఆమెకు రజనీకాంత్ నటించిన 'జైలర్'తో మరింత గుర్తింపు లభించింది. ఆ తర్వాత 'నా సామిరంగ', 'బర్త్‌మార్క్' చిత్రాల్లోనూ కనిపించారు. ప్రస్తుతం 'జైలర్ 2'తో పాటు తెలుగు చిత్రం 'డాన్ బాస్కో'లో నటిస్తున్నట్లు సమాచారం. తాజాగా విడుదల చేసిన పర్పుల్ చీర ఫొటోలు సోషల్ మీడియాలో అభిమానులను ఆకట్టుకుంటున్నాయి.





# సుకుమార్‌పై పుస్తకం ఆవిష్కరణ

**హైదరాబాద్, మహా:** ప్రముఖ దర్శకుడు సుకుమార్ సినీ ప్రయాణం, ఆయన కథా రచన, స్క్రీన్‌ప్లే రూపకల్పన, దర్శకత్వ శైలిపై రూపొందించిన 'స్క్రీన్‌ప్లే మాస్టర్ సుకుమార్' పుస్తకాన్ని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ఆవిష్కరించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన 'ఇంటర్నేషనల్ ఇంక్ బౌండ్ 2.0' కార్యక్రమంలో ఈ పుస్తకాన్ని విడుదల చేశారు. రచయిత డాక్టర్ ప్రవీణ్ యజ్ఞాల సుకుమార్ సినీ ప్రస్థానాన్ని అధ్యయనం చేసి, ఆయన చిత్రాల్లో కనిపించే కథనం, పాత్రల రూపకల్పన, సన్నివేశాల నిర్మాణం, స్క్రీన్‌ప్లేలోని ప్రత్యేకతలను విశ్లేషిస్తూ పుస్తకాన్ని రూపొందించారు. సుకుమార్ దర్శకత్వం వహించిన చిత్రాలు తెలుగు సినిమా కథన శైలిలో తీసుకొచ్చిన మార్పులు, ప్రేక్షకులను కథతో అనుసంధానించే ఆయన విధానాన్ని కూడా పుస్తకంలో ప్రస్తావించినట్లు తెలిపారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ఈ పుస్తకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. సుకుమార్ సినిమాల ద్వారా ఆయన ఆలోచనా విధానం, సృజనాత్మకతను పాఠకులకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో పుస్తకాన్ని రూపొందించినట్లు రచయిత తెలిపారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ సినిమాలు కేవలం వినోదానికి మాత్రమే పరిమితం కాకుండా సమాజానికి ఉపయోగపడే సందేశాన్ని, విజ్ఞానాన్ని అందించేలా ఉండాలని అన్నారు. మంచి కథ, చక్కటి స్క్రీన్‌ప్లే ప్రేక్షకులపై దీర్ఘకాల ప్రభావాన్ని చూపుతాయని పేర్కొన్నారు. సుకుమార్ తన చిత్రాల్లో కథ, పాత్రలు, భావోద్వేగాలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రత్యేక గుర్తింపు పొందారని అన్నారు. పుస్తకాలు జ్ఞానాన్ని విస్తరించడంతో పాటు సృజనాత్మక రంగాలపై అవగాహన పెంచుతాయని తెలిపారు. కార్యక్రమంలో రచయిత, నటుడు తనికెళ్ల భరణి, మాజీ రాజ్యసభ సభ్యుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. సాహిత్యం, సినిమా, కళా రంగాలకు చెందిన పలువురు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా 'అవేమైనా జ్ఞాపకాలా మర్చిపోవడానికి', 'అమ్మమ్మ కథల ఖజానా' తదితర పుస్తకాలను కూడా ఆవిష్కరించారు.

# మైసూర్ షెడ్యూల్‌లో బాలయ్య

**హైదరాబాద్, మహా:** నందమూరి బాలకృష్ణ, దర్శకుడు గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న యాక్షన్ డ్రామా 'దాదా' షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది. ఇటీవల చిత్రీకరణ సమయంలో గాయపడిన బాలకృష్ణ ప్రస్తుతం కోలుకుని తిరిగి షూటింగ్‌లో పాల్గొనేందుకు సిద్ధమయ్యారు. కర్ణాటకలోని మైసూరులో జరుగుతున్న తదుపరి షెడ్యూల్‌లో బాలయ్య అక్టోబర్ 5 నుంచి పాల్గొననున్నట్లు చిత్రవర్గాల సమాచారం. మైసూర్ షెడ్యూల్‌లో బాలకృష్ణపై కీలకమైన యాక్షన్, డ్రామా సన్నివేశాలను చిత్రీకరించేందుకు దర్శకుడు గోపీచంద్ మలినేని ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. బాలయ్యకు జోడీగా కాజల్ అగర్వాల్ నటిస్తుండగా, మంచు మనోజ్ ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే ఇతర నటీనటులతో కొన్ని సన్నివేశాలను చిత్రీకరిస్తున్న చిత్రబృందం.. బాలయ్య సెట్స్‌లోకి అడుగుపెట్టడంతో షూటింగ్‌ను మరింత వేగవంతం చేయనుంది.గతంలో షూటింగ్ సమయంలో బాలకృష్ణకు గాయం కావడంతో చిత్రీకరణకు కొంత విరామం ఏర్పడింది. అయినప్పటికీ విడుదల తేదీ విషయంలో మాత్రం నిర్మాతలు ముందుగా ప్రకటించిన ప్రణాళికను కొనసాగిస్తున్నారు. 'దాదా' చిత్రాన్ని డిసెంబర్ 24న క్రిస్మస్ కానుకగా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ నిర్ణయించారు. మైసూర్ షెడ్యూల్ పూర్తయిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో నిలిచిపోయిన కొన్ని సన్నివేశాలను పూర్తి చేసి, పోస్ట్ ప్రొడక్షన్ పనులను వేగవంతం చేయనున్నట్లు సమాచారం. 'వీరసింహారెడ్డి' తర్వాత బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కలిసి చేస్తున్న చిత్రం కావడంతో 'దాదా'పై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. భారీ యాక్షన్ అంశాలతో రూపొందుతున్న ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడయ్యే అవకాశం ఉంది



# సన్‌సెట్ వేళ ప్రగ్యా జైస్వాల్ సందడి



హైదరాబాద్, మహా: అందం, అభినయంతో తెలుగు ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి ప్రగ్యా జైస్వాల్ మరోసారి తన స్టైలిష్ లుక్‌తో అభిమానులను ఆకట్టుకున్నారు. తాజాగా సూర్యాస్తమయ వేళ సముద్రతీరంలో తీసుకున్న ఫొటోలను సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఫ్లోరల్ డిజైన్‌తో కూడిన అందమైన డ్రెస్‌లో కనిపించిన ప్రగ్యా.. సముద్రపు అలలు, సాయంత్రపు ఆకాశం, అస్తమిస్తున్న సూర్యుడి కాంతుల మధ్య ఫొటోలకు పోజులిచ్చారు. సహజమైన వాతావరణానికి తగ్గట్టుగా సింపుల్ మేకప్, వదులుగా వదిలిన జుట్టు, తక్కువ ఆభరణాలతో ఆమె కనిపించిన తీరు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఎరుపు, తెలుపు రంగుల ఫ్లోరల్ డిజైన్ ఉన్న డ్రెస్ ఆమె లుక్‌కు మరింత అందాన్ని తీసుకొచ్చింది. సముద్రతీరంలో ప్రశాంతంగా కూర్చొని, ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ ఆమె ఇచ్చిన పోజులు ఫొటోలకు ప్రత్యేకమైన ఫీల్‌ను తీసుకొచ్చాయి. ప్రగ్యా జైస్వాల్ 2014లో సినీ ప్రయాణాన్ని ప్రారంభించారు. అనంతరం తెలుగు చిత్రాల్లో నటిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 2015లో విడుదలైన 'కంచె' చిత్రం ఆమె కెరీర్‌లో కీలక మలుపుగా నిలిచింది. ఈ సినిమాలో ఆమె నటనకు మంచి స్పందన రావడంతో పాటు ఉత్తమ నూతన నటిగా ఫిల్మ్‌ఫేర్ అవార్డును కూడా అందుకున్నారు. ఆ తర్వాత 'జయ జానకి నాయక', 'నక్షత్రం', 'ఆచారి అమెరికా యాత్ర' తదితర చిత్రాల్లో నటించారు. బాలకృష్ణతో కలిసి నటించిన 'అఖండ' సినిమా ఆమెకు మరింత గుర్తింపును తీసుకొచ్చింది. ఇటీవల కూడా పలు చిత్రాల్లో నటిస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నారు. సినిమాలతో పాటు సోషల్ మీడియాలోనూ ప్రగ్యా యాక్టివ్‌గా ఉంటారు. తన ఫ్యాషన్ స్టైలింగ్, ట్రావెల్ అనుభవాలు, ఫొటోషూట్‌లకు సంబంధించిన చిత్రాలను అభిమానులతో పంచుకుంటుంటారు. ఆమె షేర్ చేసే ప్రతి కొత్త ఫొటోషూట్‌కు నెటిజన్ల నుంచి మంచి స్పందన వస్తుంటుంది. తాజాగా సన్‌సెట్ సమయంలో సముద్రతీరంలో తీసుకున్న ఫొటోలు కూడా సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ప్రకృతి అందాలు, సాయంత్రపు కాంతులు, ప్రగ్యా స్టైలిష్ లుక్ కలిసిన ఈ ఫొటోలు అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

# ఓటీటీలోకి కీర్తి సురేశ్ 'అక్క'

హైదరాబాద్, మహా: జాతీయ అవార్డు గ్రహీత కీర్తి సురేశ్ ప్రధాన పాత్రలో నటించిన 'అక్క' వెబ్‌సిరీస్ ఓటీటీ ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. కీర్తి సురేశ్‌తో పాటు రాధికా ఆప్టే కీలక పాత్రలో నటించిన ఈ క్రైమ్ థ్రిల్లర్ సిరీస్‌పై ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. ప్రముఖ నిర్మాణ సంస్థ వైఆర్‌ఎఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఈ సిరీస్‌ను రూపొందించింది. నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ కానున్న 'అక్క' అక్టోబర్ 30 నుంచి అందుబాటులోకి రానున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే అధికారిక విడుదల తేదీపై చిత్రబృందం నుంచి స్పష్టమైన ప్రకటన రావాల్సి ఉంది. 1980ల కాలాన్ని నేపథ్యంగా తీసుకుని ఈ కథను రూపొందించినట్లు సమాచారం. దక్షిణ భారతదేశంలోని పెర్నూరు అనే కల్పిత ప్రాంతం చుట్టూ కథ సాగుతుంది. సాధారణ ప్రాంతాలకు భిన్నంగా అక్కడ మహిళల ఆధిపత్యం కొనసాగుతుంటుంది. తమకంటూ ప్రత్యేకమైన వ్యవస్థను ఏర్పరుచుకున్న మహిళా గ్యాంగ్‌స్టర్ల జీవితం, వారి మధ్య ఉన్న సంబంధాలు, అధికార పోరాటం కథలో ప్రధాన అంశాలుగా ఉండనున్నాయి. ఈ ప్రపంచంలోకి ఓ బయటి వ్యక్తి ప్రవేశించడంతో పరిస్థితులు ఒక్కసారిగా మారిపోతాయి. అప్పటివరకు ఒకరికొకరు అండగా నిలిచిన వారి మధ్య అనుమానాలు, విభేదాలు మొదలవుతాయి. అధికారం కోసం జరిగే పోరాటం ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందన్నదే సిరీస్‌లో ఉత్కంఠను పెంచనుంది.కీర్తి సురేశ్ ఈ ప్రాజెక్ట్‌లో ఇంతకుముందు కనిపించని కొత్త తరహా పాత్రలో నటిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా గ్యాంగ్‌స్టర్ నేపథ్యంతో కూడిన శక్తివంతమైన పాత్రలో ఆమె కనిపించనుండటంతో అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. మరోవైపు రాధికా ఆప్టే కూడా కీలక పాత్రలో నటిస్తున్నారు. వీరిద్దరూ తొలిసారి కలిసి నటిస్తున్న ప్రాజెక్ట్ కావడం 'అక్క'కు మరో ప్రత్యేకతగా మారింది. సీనియర్ నటి తన్వీ ఆజ్మీతో పాటు పలువురు నటులు ఇందులో కీలక పాత్రలు పోషించారు. ధర్మరాజ్ శెట్టి ఈ సిరీస్‌కు దర్శకత్వం వహిస్తున్నారు. వైఆర్‌ఎఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్‌కు ప్రముఖ నిర్మాతలు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్లుగా వ్యవహరిస్తున్నారు. 1980ల కాలానికి సంబంధించిన వాతావరణం, అప్పటి సామాజిక పరిస్థితులు, మహిళల మధ్య సోదరీభావం, ఆధిపత్యం, ప్రతీకారం వంటి అంశాలను క్రైమ్ థ్రిల్లర్ శైలిలో చూపించనున్నట్లు సమాచారం. ఇప్పటికే విడుదలైన ప్రచార కంటెంట్ సిరీస్‌పై ఆసక్తిని పెంచింది. కీర్తి సురేశ్ ఇప్పటివరకు వెండితెరపై విభిన్న పాత్రలతో తన ప్రత్యేకతను చాటుకున్నారు. ఇప్పుడు ఓటీటీ కోసం ఎంచుకున్న 'అక్క'లో మరో కొత్త కోణంలో కనిపించనున్నారు. నెట్‌ఫ్లిక్స్ ద్వారా దేశవ్యాప్తంగా ప్రేక్షకులకు ఈ సిరీస్ చేరుకోనుంది. అక్టోబర్ 30న స్ట్రీమింగ్ ప్రారంభమవుతుందన్న ప్రచారానికి అధికారిక ధ్రువీకరణ రావాల్సి ఉన్నప్పటికీ, కీర్తి సురేశ్, రాధికా ఆప్టే కలయికలో వస్తున్న ఈ క్రైమ్ థ్రిల్లర్‌పై ప్రేక్షకుల్లో మాత్రం అంచనాలు పెరుగుతున్నాయి.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com